
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 307 | ది. 18-2-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 307 | Date : 18-2-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |




భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కోసం విశాఖపట్నం చేరుకున్నారు. శ్రీమతి ద్రౌపది ముర్ము కి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వాగతం పలికిన చిత్రం -విశాఖపట్నం,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :

## అధికారుల తీరుపై రేవంత్ అసంతృప్తి...
# సస్పెండ్ చేస్తానని వార్నింగ్

● పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖపై రేవంత్ సమీక్ష ● కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచి ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశం ● అడ్వర్టైజింగ్ బోర్డుల నియంత్రణపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



**హైదరాబాద్,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** తెలంగాణలో పురపాలక శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో ఈరోజు నిర్వహించిన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖపై సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచి ఫీల్డ్‌లో ఉండాలి. పారిశుద్ధ్యం, రోడ్ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులను సస్పెండ్ చేస్తాను" అని హెచ్చరించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు ఒక రోజు శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అధికారులకు కీలక సూచనలు చేశారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ బాగా ఉన్న చోట్ల పీపీపీ విధానంలో స్కైవాక్ బ్రిడ్జిలు నిర్మించాలని చెప్పారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నియంత్రణపై జాగ్రత్తలు తీసుకోవాలని... ప్రభుత్వ కార్యక్రమాలకు 10 శాతం బోర్డులు కేటాయించాలని అన్నారు. అనధికార బోర్డులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒకసారి ఫీజు వసూలు చేయాలని సూచించారు. అన్ని పార్కుల వివరాలు సేకరించాలన్నారు.

# గత ప్రభుత్వం తెచ్చిన జీవో 117తో ప్రభుత్వ స్కూళ్లకు బాలల దూరం!

● వన్ క్లాస్ -- వన్ టీచర్ పాఠశాలలను 33శాతానికి పెంచాం ● రూ.1000 కోట్లతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తాం ● శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్



**అమరావతి,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** గత ప్రభుత్వం 2019-24 నడుమ జీవో 117 తేవడంతో పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజాప్రభుత్వం వచ్చాక జీవో 117 రద్దుచేశామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ...గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన తర్వాత కూడా 233 పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా పాఠశాల విద్యాభివృద్ధిలో వన్ క్లాస్ -- వన్ టీచర్ విధానం చాలా కీలకమైంది. గతంలో 3శాతం పాఠశాలల్లో మాత్రమే వన్ క్లాస్ -- వన్ టీచర్ ఉంటే, ఇప్పుడు 33శాతానికి పెంచాం. దీనిద్వారా పిల్లలకు మెరుగైన విద్య అంది, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వస్తాయి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ప్రధానంగా 5 అంశాలను పరిగణనలోకి తీసుకున్నాం. ప్రధానంగా లీక్ ప్రూఫ్ బిల్డింగ్, పెయింట్స్, బెంచీలు, టాయ్ లెట్స్, తాగునీరు అందించాలని నిర్ణయించాం. ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ ఇచ్చాం. ఏపీలో 5స్టార్ రేటింగ్ ఉన్నవి లేవు. 40శాతం 1,2లో స్టార్ లో ఉన్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 3, 4 స్టార్ రేటింగ్ కు తేవాలన్నది ప్రజాప్రభుత్వ లక్ష్యం. పెండింగ్ వర్క్స్ పూర్తిచేయాల్సిన బాధ్యత మాపై ఉంది. ఎక్కడ క్లాస్ రూమ్స్ అవసరం ఉందో, అక్కడ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని నిర్ణయించాం. ఎస్ఎంసీ ఎకౌంట్ లో రూ.200 కోట్ల నిధులు ఉన్నాయి. బడ్జెట్ లో రూ.800 కోట్లు అదనంగా కేటాయించారు. ఈ రెండు కలిపి వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక మౌలిక సదుపాయాలకు రూ. వెయ్యి కోట్లు ఖర్చుచేసే అవకాశం ఉంది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒక పద్ధతి ప్రకారం 5స్టార్ రేటింగ్ తెచ్చే బాధ్యత ప్రజాప్రభుత్వం తీసుకుంటుంది. 2014-19 నడుమ చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడతామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

**అంతకుముందు ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ...** గత ప్రభుత్వం పాఠశాలల విషయంలో అస్తవ్యస్థ విధానాలు అవలంభించింది. నాడు- నేడు పేరుతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడింది. వాటి కారణంగా నేటికి కూడా అనేక చోట్ల అసంపూర్తి నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యాన నూతన విద్యావిధానానికి శ్రీకారం చుట్టి, పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టుల నియామకం చేపట్టారు. మనబడి -- మన భవిష్యత్ పేరిట పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతూ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పెరుగుతోంది. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలు, తరగతి గదులను సత్వరం పూర్తిచేయాల్సిందిగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. 2019 ఎన్నికలకు ముందు తిత్లీ తుపానులో అనేక పాఠశాలలు దెబ్బతిన్నాయి. నాటి చంద్రబాబు గారి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసినప్పటికీ, టీడీపీ సానుభూతిపరులు పనులు చేశారనే కారణంతో వైసీపీ ప్రభుత్వం వాటి బిల్లులు చెల్లించలేదు. గత ఐదేళ్లలో నాడు-నేడు అక్రమాలపై చర్యలు తీసుకోండి. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలు పూర్తిచేయాల్సిందిగా గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు.

# తిరుమల లడ్డూ కల్తీపై వైసీపీ దొంగ ఏడుపు

● సిగ్గుపడాల్సింది పోయి ఎదురుదాడి చేస్తున్న వైసీపీ నేతలు ● లడ్డూ కల్తీ నిజం...అప్పటి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డే కల్తీ జరిగిందని అంగీకారం ● హెరిటేజ్‌పై ఆరోపణలు -- ఆధారాలు ఎక్కడ? కల్తీతో సంబంధం లేని సంస్థను లాగి దృష్టి మళ్లింపు ● హిందూ సంప్రదాయాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు ● నిజం దాగదు, బాధ్యులపై చర్యలు తప్పవని మండలిలో హెచ్చరించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** మంగళవారం శాసనమండలిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైసీపీ ఎమ్మెల్సీలపై, ఆ పార్టీ నేతలపై ఆగ్రహంతో విరుచుకుపడ్డారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని అప్పటి టీటీడీ చైర్మన్ స్వయంగా ఒప్పుకున్న వాస్తవాన్ని దాచిపెట్టి, సిగ్గుపడాల్సింది పోయి వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై ఎదురు దాడులు చేయడం, సంబంధం లేని హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు చేయడం దారుణమని ఆయన మండిపడ్డారు. కల్తీ జరిగిందని ఒప్పుకున్న తర్వాత కూడా బాధ్యత నుంచి తప్పించుకోవడానికి కుట్ర రాజకీయాలు చేయడం వైసీపీ తీరుకు నిదర్శనమన్నారు. మాజీ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్వయంగా లడ్డూ కల్తీ విషయాన్ని ఒప్పుకున్నారు అనే నిజాన్ని ప్రజలు మరచిపోరన్నారు. అయినా ఈ రోజు అదే వైసీపీ నేతలు దాన్ని మళ్లించేందుకు కొత్త ఆరోపణలు తీసుకురావడం, నిజాలను వక్రీకరించడం అత్యంత ఖండనీయం అని పేర్కొన్నారు. ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయాలనుకోవడం రాజకీయ దిగజారుడుతనం అని విమర్శించారు. హెరిటేజ్ ఇష్యూపై వైసీపీ చేస్తున్న ఆరోపణలకు ఒక్క ఆధారం అయినా చూపించగలరా? అని మంత్రి సూటిగా ప్రశ్నించారు. కల్తీతో ఎలాంటి సంబంధం లేని హెరిటేజ్ సంస్థ పేరును లాగడం ద్వారా అసలు అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఆధారాల్లేని ఆరోపణలు చేస్తే చట్టపరంగా, నైతికంగా సమాధానం చెప్పాల్సిందే అని హెచ్చరించారు. అదే విధంగా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరుమల శ్రీవారి ఆలయానికి వెళ్లి డిక్లరేషన్ ఎందుకు ఇవ్వడం లేదు? అని మంత్రి ప్రశ్నించారు. హిందూ సంప్రదాయాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని, ఎందుకంటే హిందువుల మనోభావాలను దెబ్బతీసింది ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసు అని వ్యాఖ్యానించారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు వంటి పవిత్ర సంస్థల ప్రతిష్ఠను దెబ్బతీయడానికి వైసీపీ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరని మంత్రి హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఒప్పుకున్న వాస్తవం నుంచి తప్పించుకునే ప్రయత్నాలు ఎంత చేసినా నిజం దాగదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# పలాసలో ఏప్రిల్ కు ఆర్వోబీ, జూన్ నుండి కేంద్రీయ విద్యాలయ తరగతులు : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**శ్రీకాకుళం,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మంగళవారం నాడు శ్రీకాకుళం జిల్లాలోని పలాస పట్టణంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఉదయం 9 గంటలకు పలాస చేరుకున్న కేంద్ర మంత్రి తొలుత రైల్వే స్టేషన్ సమీపంలోని పై వంతెన పనులను సమీక్షించారు. ప్రాజెక్ట్ రిపోర్టును పరిశీలించి.. ప్రస్తుత స్థితిని ఆరా తీశారు. పనుల్లో ఆలస్యం జరుగుతోందని, రేయింబవళ్ళు పనులు జరగాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని అదేశించారు. రైల్వే వంతెన తో పాటు అనుకుని సర్వీసు రోడ్డు పనులు కూడా వేగంగా జరపాలని తెలిపారు. అనంతరం అక్కడి నుండి పలాస లోని నెమలికొండ ప్రాంతాలలో త్వరలో నిర్మాణం జరగనున్న కేంద్రీయ విద్యాలయ ప్రాంతాన్ని పరిశీలించారు. భవనాలు నిర్మాణం జరిగే తీరును ప్రాజెక్టు రిపోర్టు ద్వారా కేంద్ర మంత్రికి కలెక్టర్, ఆర్డీవో వివరించారు. పాఠశాలకు అనుసంధానం అయ్యే రోడ్లు, ఇతర మౌలిక వసతులను ఆరా తీశారు. అక్కడి నుండి పలాస పట్టణంలోని రైల్వే కాలనీలో బారక్ భవనాలను పరిశీలించారు. రాబోయే విద్యా సంవత్సరం తరగతులను ఈ భవనాలు నుండి జరపాలని నిర్ణయించిన నేపథ్యం లో రైల్వే అధికారులతో గదుల అప్పగింతపై అనుమతుల సమస్యను పరిష్కరించారు. కేంద్రీయ విద్యాలయ అధికారులతో సమన్వయం చేసుకుని ఈ ఏడాది తరగతులు పక్కగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. పలాస పరిసర ప్రాంతాలతో పాటు జిల్లా వాసుల ఎన్నో ఏళ్ల కల అయిన, పలాస ఆర్.ఓ.బి. ప్రాజెక్టు ఇప్పుడు వేగంగా నిర్మాణం జరుగుతూ ఉండటం ఆనందంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనికి అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చి, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను తిరిగి ప్రారంభించామని తెలిపారు. భారతీయ రైల్వే మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ ROB పూర్తి అయితే పలాస పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలు కలుగుతాయని అన్నారు. అలాగే పలాస లో ఏర్పాటు కానున్న కేంద్రీయ విద్యాలయానికి తాజా వివరాలను వెల్లడించారు. రాబోయే విద్యాసంవత్సరం నుండే తరగతుల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి బారెక్ భవనాలకు సంబంధించిన అనుమతుల సమస్యను పరిష్కరించామని తెలిపారు. ఈ పాఠశాల ద్వారా సాయుధ దళాల సిబ్బంది, కేంద్ర సంస్థల ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభిస్తాయనీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటాం: అయ్యన్నపాత్రుడు

**అమరావతి,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈరోజు గంట ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ... సాఫ్ట్ వేర్ సమస్యే దీనికి కారణమని చెప్పారు. టెక్నికల్ సమస్య వచ్చినప్పుడు ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు. వైసీపీ వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారని... గతంలో ఫేస్ టు ఫేస్ రాజకీయాలు ఉండేవని... ఇప్పుడు వైసీపీ వాళ్లు వెనక నుంచి గుంతలు తవ్వే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సభకు హాజరుకాని వైసీపీ సభ్యుల గురించి మాట్లాడుతూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత విధులను సక్రమంగా నిర్వహించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని అన్నారు. సభకు రాకుండా జీతభత్యాలు తీసుకోవడం సరికాదని చెప్పారు. విధులకు హాజరుకాని ఉద్యోగులకు జీతం కట్ చేస్తారని... ఆ నిబంధన ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించదని ప్రశ్నించారు.

## నోటీసు

**విజయవాడలోని VIII అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో**

O.S. NO.141/2025

Between:
Matta Venkata Sudhkar
---------Plaintiff
And
To
Gollanapalli Vamsi Krishna Surya, S/o Phani Sai
R/o D.No.31-18-2, Narla Vari Street, Machavaram, Vijayawada-520004
---------Defendant

పై నెంబరు O.S లో మీ హాజరు నిమిత్తం ది.24-02-2026 వ తేదీనకు వాయిదా అయివున్నది. కనుక పై నెంబర్‌లో ప్రతివాది అయిన మీరు పై తేదీన పై కోర్టు ఎదుట స్వయంగా గానీ లేదా అడ్వకేట్ ద్వారా గానీ హాజరై మీకు గల అక్షేపణలు తెలుపు కోవలసిందని, లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయటమైనది.

(By Order of the Honorable court)

వాయిదా తేదీ : 24-02-2026

ఇట్లు

**Smt. K.Sarala Benarjee**
Advocate of Plaintiff
Machavaram Down,
Vijayawada

## IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) NANDIGAMA

E.P. No. 41/2025 in O.S. No. 143/2022

Between:
Chitrapu Nageswara Rao,
S/o Late Venkata Gopaiah, Hindu, Business, Aged about 62 years, resident of Nandigama Nagar Panchayat, Nandigama Mandal, NTR District within the jurisdiction of this Hon'ble Court
--------Petitioner-Decree Holder-Plaintiff
And
Smt. Neelam Malathi, W/o S.V.B.R. Prasad,
D/o late Jayana Satyanarayana, Hindu, Home Maker, Aged about 40 years, resident of Door No.11-62-121A, Near Vinayak Temple, I Town, Vijayawada, NTR District, within the jurisdiction of Principal Junior Civil Judge's Court, Vijayawada.
--------Respondent-2nd Judgment debtors-2nd Defendant

పై నెంబరు పిటీషన్ లో Respondent/Defendant అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకోనందున పేపర్ ద్వారా నోటీసు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. వాయిదా ది.13-3-2026 నకు అయి ఉన్నది. కావున సదరు వాయిదా తేదీన ఉదయం గం.10.30ని॥లకు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనవలెను లేని యెడల మీకు పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా తేది : 13-3-2026

ఇట్లు

**గోపు వెంకట శ్రవణ్ కుమార్,** బి.యల్.,
న్యాయవాది/నోటరి సెల్ : 9849348063

# చంద్రగిరిలో అడ్డుకట్ట వెయ్యలేని రెవెన్యూ అధికారులు







**చంద్రగిరి,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** ప్రకృతి వనరుల దోపిడీని ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే హెచ్చరిస్తున్న అక్రమార్కుల తీరు మార్చుకోవడం లేదు. మట్టి ,గ్రావెల్ ,ఇసుక ఇలా ఏ సహజ వనరులైన మాఫియా కొల్లగొడుతుంది. ఎర్ర బంగారంగా పిలవబడే ఇసుక అక్రమ రవాణాకు కేరాఫ్ గా చంద్రగిరి మండలం మారింది. తాజాగా చంద్రగిరి మండలం, నాగయ్యగారిపల్లి గ్రామంలో స్వర్ణముఖి నదిలో భూ బకాసురులు ఇసుకను మాయం చేస్తున్నారు. స్వర్ణముఖి నదిలో తిష్ట వేసి, నది మధ్యలో నుంచి టిప్పర్లు వెళ్ళేందుకు తాత్కాలిక రోడ్డును వేసి ఇసుక బకాసురులు గత మూడు రోజులుగా అక్రమంగా జెసిబి లతో తవ్వేస్తున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గత వారం రోజులకుపైగా పగలు, రాత్రి తేడా లేకుండా టిప్పర్లతో నదిలోని ఇసుక జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన గ్రామస్తులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన , స్థానిక రెవెన్యూ సిబ్బంది మామూళ్ల మత్తుల్లో అదేమీ లేదంటూ ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తున్నారని ప్రజల మండిపడుతున్నారు. గ్రామస్తులు ఇసుక తోలుతున్న టిప్పర్లను గట్టిగా నిలదీయగా అభివృద్ధి పనులకంటూ బుకాయించారని గ్రామస్తులు తెలిపారు. అభివృద్ధి పనులకు ఇసుకను రీచ్ నుంచి కొనుగోలు చేయాలే తప్ప ఇలా నదిని గుల్లచేయడం ఏమిటంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదివరలో మండలంలో ఇసుక అక్రమ రవాణా పై పత్రికలలో వార్తలు ప్రచురించిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తున్నారు. గ్రావెల్ , మట్టి అక్రమ తవ్వకాలపై స్థానికల నుంచి ఫిర్యాదులు వచ్చిన సందర్భాలలో రెవెన్యూ ,పోలీస్, గనుల శాఖ అధికారులు అడపా దడప నాలుగైదు ట్రాక్టర్లు టిప్పర్లు స్వాధీనం చేసుకొని మామ అనిపిస్తున్నారు తప్ప కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు తమ వైఖరి మార్చుకుంటేనే అక్రమ తవ్వకాలు రవాణాకు అడ్డుకట్ట పడుతుంది. ఇకనైనా అధికారులు ఇసుక మాఫియా పై ఉక్కు పాదం మోపి అక్రమ తవ్వకాలు తరలింపులకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. అయితే అధికారులు ఏమాత్రం స్పందిస్తారో వేచి చూద్దాం.

# పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ పదవిలో కొనసాగేందుకు దామోదర నాయుడుకు అర్హత లేదు

● చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చిన హైకోర్టు డివిజన్ బెంచ్ ● వెంటనే తప్పుకోవాలంటూ అసోసియేషన్ డిమాండ్.



**పెడన,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** పునర్ నియామకం పొందిన పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ పదవిలో కొనసాగేందుకు దామోదర్ నాయుడుకు అర్హత లేదని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సోమవారం జరిగిన పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు కేసు విషయమై ఓరల్ అబ్జర్వేషన్స్ -- సంక్షిప్త సారాంశం వివరాలు సమీక్షిస్తే... డా. టీ దామోదర నాయుడు అదే డైరెక్టర్ పదవిలో కొనసాగేందుకు కోరుతూ దాఖలు చేసిన రిట్ అప్పీల్ పై స్టే ఆర్డర్ ను ఏపీ హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది.అందుకు సంబందించిన పూర్తి వివరాలు ఇలా వున్నాయి. డా. టీ దామోదర నాయుడు దాఖలు చేసిన రిట్ అప్పీల్ తో పాటు ప్రభుత్వం కూడా ఈనెల 16 న న రిట్ అప్పీల్ దాఖలు చేసింది. విచారణలో ప్రభుత్వం తరపున గౌరవ అడ్వకేట్ జనరల్ హాజరై వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా గౌరవ డివిజన్ బెంచ్ కొన్ని ముఖ్యమైన అంశాలను ప్రస్తావించింది. పదవీ విరమణ పొందిన తరువాత డా.టీ దామోదర నాయుడు డైరెక్టర్ పదవికి తిరిగి నియమించబడేందుకు అవసరమైన అర్హత లేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ విధంగా తిరిగి నియామకం చేయడం ద్వారా పశుసంవర్ధక శాఖలో డైరెక్టర్ పదవికి తగిన అర్హత సామర్థ్యం కలిగిన అధికారులు లేరని ప్రభుత్వం సూచిస్తున్నదా? అని కోర్టు ప్రశ్నించింది. ఇటువంటి పునర్ నియామకం లను అనుమతిస్తే డైరెక్టర్ పదవికి అర్హత కలిగిన ఫీడర్ కేటగిరీ అధికారులకు ప్రభుత్వం ఏ సందేశం ఇస్తుంది? అని కోర్టు సందేహం వ్యక్తం చేసింది. డిపార్ట్మెంట్‌లో ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న అధికారులు డైరెక్టర్ పదవికి అనర్హులు అని ప్రభుత్వం భావిస్తున్నదా? అని కోర్టు ప్రశ్నించింది. పునర్ నియామకం ను వ్యతిరేకిస్తూ ఫీడర్ కేటగిరీ కు చెందిన అగ్గరివేడ్ పర్సన్స్ ఎవరైనా కేసు వేశారా? అని కోర్టు ప్రశ్నించగా అసోసియేషన్లతో కలిసి కేసు దాఖలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. జడ్జిల నియామకాలలో కూడా రిటైర్డ్ వ్యక్తులను తిరిగి నియమిస్తే వెనుక ఉన్న వారి పరిస్థితి ఏమిటి? అని కోర్టు ప్రశ్నించింది. ఐఏఎస్ అధికారుల నియామకాలలో కూడా రిటైర్డ్ అధికారులను తిరిగి నియమించడం వల్ల చాలా మంది అధికారులకు నష్టం జరుగుతోందని కోర్టు గమనించింది. కోర్టు ఇచ్చిన ముఖ్యమైన ఆదేశాలు కేసు తదుపరి విచారణను ఈనెల 24వ తేదీ కు వాయిదా వేసింది. అప్పటి వరకు ఈ సంవత్సరం జనవరి 29 న సింగల్ జడ్జి ఇచ్చిన ఆర్డర్ యథాతథంగా కొనసాగుతుంది. ప్రభుత్వం వెంటనే సింగల్ జడ్జి ఆర్డర్ ను అమలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది.కోర్ట్ ఆర్డర్ ను అమలు చేయని పక్షంలోఅది కోర్టు ధిక్కారం గా పరిగణించబడుతుందని కోర్టు హెచ్చరించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు పట్ల ఏపీ వి ఎల్ వో అసోసియేషన్ కృష్ణాజిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆత్మురి రమేష్ బాబు ఏపీ ఎల్ ఎస్ ఎ సర్వీస్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు ముక్కు వీరబాబు ఏపీ వి ఎల్ వో అసోసియేషన్ ప్రతినిధి ఎస్ వి వి రామారావు లు హర్షం ప్రకటించారు. ఇప్పటికైనా కోర్టు తీర్పును అనుసరించి డైరెక్టర్ పదవ నుంచి దామోదర్ నాయుడు వెంటనే తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

# మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ని కలిసిన టిడిపి సీనియర్ లీడర్



**విస్సన్నపేట,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కొర్లమండ గ్రామానికి చెందిన సీనియర్ లీడర్ నెక్కలపు శ్రీనివాసరావు( ఎన్ఎస్ టీవీ ప్రసాద్ ) మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని కలిసి వినత మాత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దళిత సామాజిక వర్గ కుటుంబాలకు భరోసా ఇచ్చేందుకు వినతి పత్రం ఆమెకు అందించినట్లు శ్రీనివాసరావు తెలియజేశారు.

# ప్రమాదం వద్దు.. ప్రాణం ముద్దు..

● రహదారి భద్రతపై పెడన పోలీసుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం...



**పెడన,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పెడన అదనపు ఎస్ఐ షేక్ బషీర్ ఆధ్వర్యంలో మచిలీపట్నం-- కత్తిపూడి 216 జాతీయ రహదారిపై పెడన తోటమూల సెంటర్ వద్ద ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గతంలో ప్రమాదానికి గురైన వాహనాన్ని రహదారి పక్కన ఏర్పాటు చేసి, ప్రమాదాల తీవ్రతను వాహనదారులు ప్రత్యక్షంగా గమనించేలా చేశారు. ప్రమాదాల వల్ల కలిగే ప్రాణనష్టం, కుటుంబాలపై పడే భారాన్ని ప్రజలకు అర్థమయ్యే విధంగా పోలీసులు వివరించారు. పోలీసులు వాహనదారులకు వేగ నియంత్రణ పాటించడం మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించడం వంటి ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. నిర్లక్ష్యం క్షణాల్లోనే ప్రాణాపాయం కలిగిస్తుందని జాగ్రత్తగా ప్రయాణించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

# గడపగడపకు నంది వాహనులై ఆదిదంపతుల దర్శనం ఇచ్చిన వేళ!



**విస్సన్నపేట,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి వారి ఆలయ ప్రాంగణం నుండి ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులను నంది వాహనంపై నగరంలో ఊరేగింపు నిర్వహించారు. గతంలో మహ శివరాత్రి, కార్తీక మాసం తదితర పండుగల సమయంలలో శివాలయానికి భక్తులు రావడం కార్తీకమాసంలో స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు హో మాలు ఒత్తులు వెలిగించుట తదితర కార్యక్రమాలు నిర్వహించేవారని మహాశివరాత్రికి మూడు రోజులు కళ్యాణం రథోత్సవం తదితరాలు జరపడం జరిగేదని నూతనంగా గ్రామంలోనికి ఊరేగింపుగా ప్రతి ఇంటికి స్వామివార్లను నంది వాహనదారులుగా గుడికి రాలేని వాళ్లకు సైతం ఆది దంపతులను దర్శించుకునే లక్ష్యంగా గతంలో నిలిపివేసిన ఆనవాయితీకి తిరిగి ఊపిరి పోసేందుకు శ్రీకారం చుట్టినట్లు ఆలయ చైర్మన్ వెంబటి శ్రీకృష్ణ జనార్ధనరావు తెలియజేశారు. లక్ష్మీ టాకీస్ సెంటర్,తెలికల వారి వీధి, మూడు నాలుగు వార్డుల బజార్, కమ్మటూరు, నూజివీడు రోడ్డు గాంధీ బొమ్మ సెంటర్, తిరువూరు రోడ్డు,సచివాలయం వన్ వీధి,కొత్తపేట పాత పోలీస్ స్టేషన్ వయా సత్తుపల్లి రోడ్ తదితర ప్రాంతాల రూట్ ద్వారా పార్వతీ పరమేశ్వర స్వామి వార్ల దర్శనం కొరకు పథక రచన చేయడం జరిగింది అన్నారు.

# స్లీప్ ఆప్నియా నిర్లక్ష్యం చేయరానిది - డాక్టర్ రవీంద్రనాథ్




**విజయవాడ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** నిద్రలో శ్వాస పదేపదే ఆగిపోవడం అనే సమస్యను స్లీప్ ఆప్నియా అంటారని, ఇది కేవలం గురక మాత్రమే కాకుండా శరీరంలోని ఆక్సిజన్ స్థాయిని తగ్గించి గుండె, మెదడు వంటి ముఖ్య అవయవాలపై తీవ్రమైన ప్రభావం చూపే ప్రమాదకర ఆరోగ్య సమస్య అని ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ ఎం. రవీంద్రనాథ్ తెలిపారు. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, ఊబకాయం పెరుగుతున్న కారణంగా స్లీప్ ఆప్నియా సమస్య రోజురోజుకీ ఎక్కువ అవుతోందని ఆయన అన్నారు. వాసవ్య నర్సింగ్ హోంలో డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో "స్లీప్ ఆప్నియా" అంశంపై ప్రసంగించిన ఆయన, ఈ వ్యాధి ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుందని వివరించారు. నిద్రలో గొంతు మార్గం మూసుకుపోవడం వల్ల వచ్చే అబ్స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా ఒకటి కాగా, మెదడు శ్వాస నియంత్రణలో లోపం కారణంగా కలిగే సెంట్రల్ స్లీప్ ఆప్నియా మరో రకమని తెలిపారు. ఊబకాయం, మెడ చుట్టూ అధిక కొవ్వు, ధూమపానం, మద్యపానం, ముక్కు లేదా గొంతు నిర్మాణ లోపాలు, టాన్సిల్స్ పెరగడం, అధిక వయస్సు వంటి అంశాలు ఈ వ్యాధికి ముఖ్య కారణాలుగా ఆయన పేర్కొన్నారు. బిగ్గరగా గురక పెట్టడం, నిద్రలో శ్వాస ఆగినట్లు అనిపించడం, రాత్రి అకస్మాత్తుగా ఉక్కిరిబిక్కిరి అవుతూ మేల్కొనడం, ఉదయం తలనొప్పి, నోరు పొడిబారడం, పగటి వేళ అధిక నిద్రమత్తు, ఏకాగ్రత లోపం, జ్ఞాపకశక్తి తగ్గడం, చిరాకు, పనితీరు తగ్గిపోవడం వంటి లక్షణాలు సాధారణంగా కనిపిస్తాయని తెలిపారు. సమయానికి చికిత్స చేయకుండా వదిలేస్తే అధిక రక్తపోటు, గుండెజబ్బులు, బ్రెయిన్ స్ట్రోక్, డయాబెటిస్ వంటి సమస్యలతో పాటు రోడ్డు ప్రమాదాల ప్రమాదం కూడా పెరుగుతుందని ఆయన హెచ్చరించారు. స్లీప్ ఆప్నియా నిర్ధారణకు స్లీప్ స్టడీ ముఖ్యమైన పరీక్ష అని, దీనిలో నిద్ర సమయంలో శ్వాస, ఆక్సిజన్ స్థాయి, గుండె స్పందనలు, మెదడు తరంగాలు నమోదు చేస్తారని వివరించారు. అవసరమైతే హోమ్ స్లీప్ టెస్ట్, ఈఎన్‌టీ పరీక్షలు, రక్తపరీక్షలు, ఎక్స్‌రే లేదా ఇతర స్కాన్లు కూడా చేస్తారని చెప్పారు. చికిత్సలో మొదట జీవనశైలిలో మార్పులు ముఖ్యమని, బరువు తగ్గడం, ధూమపానం-- మద్యపానం మానేయడం, పక్కకు తిరిగి నిద్రపోవడం వంటి చర్యలు ఉపశమనాన్ని ఇస్తాయని తెలిపారు. తీవ్రమైన అబ్స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియాలో సీపీఏపీ థెరపీ అత్యంత ప్రభావవంతమైన చికిత్సగా ఉంటుందని పేర్కొన్నారు. కొందరికి ముక్కు--గొంతు మార్గాలను విస్తరించే ఆధునిక శస్త్రచికిత్సా పద్ధతులు కూడా ఉపశమనం కలిగిస్తాయని అన్నారు. స్లీప్ ఆప్నియాను నిర్లక్ష్యం చేయకుండా సరైన సమయంలో వైద్యుల సలహా తీసుకుంటే పూర్తిగా నియంత్రించవచ్చని, ఆరోగ్యకరమైన నిద్రే ఆరోగ్యకరమైన జీవితానికి పునాది అని గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. గురకను చిన్న సమస్యగా కాకుండా ఒక హెచ్చరికగా భావించి ప్రతి ఒక్కరూ ఈ వ్యాధిపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో పాల్గొన్న పలువురు తమ సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి అందచేత



**పెడన,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** కానూరు పంచాయతీ లోని కానూరు గ్రామం లోని కృష్ణ జిల్లా తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధిని మంగళవారం నాడు అందజేశారు. చిటికినేటి శివశంకరరావు కి 23200 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందచేశారు కానూరు గ్రామంలో ఆటో ప్రమాదంలో గాయపడి కాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు,వైద్య ఖర్చుల భారం పేద ప్రజలపై పడకూడదనే లక్ష్యంతో సీఎం రిలీఫ్ ఫండ్ మన సీఎం చంద్ర బాబు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు ఈ కార్యక్రమంలో పీత రాము బొమ్మిడి పెద్ద ఏడుకొండలు జొన్నల నాగమల్లేశ్వరావు బొమ్మిడి స్వామి అల్లం పెద్ది రాజులు పీత కొండ ఈవన చంద్రరావు పాల్గొన్నారు

# ఆరోగ్యమే మహాభాగ్యం - ఎంపీపీ గద్దల మల్లయ్య



**విస్సన్నపేట,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ కావలి శంకరరావు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు పరాన జీవి పురుగుల ఇన్ఫెక్షన్ చికిత్సలో వాడే ఔషధమైన ఆల్బెండజోల్ పురుగులు పెరుగుదలను అరికట్టే ఔషధాన్ని మండల వైద్యాధికారి కే శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రేగు పురుగులైన ఆరోగ్యమే మహాభాగ్యం అని శారీరక మానసిక మరియు సామాజిక శ్రేయస్సు నిజమైన సంపదని మంచి ఆరోగ్యం లేని దానం ఎంత ఉన్న వృధా అని ఆరోగ్యకరమైన జీవన శైలి పోషకాహారం మరియు నిరంతర వ్యాయామం ఒత్తిడి లేని జీవితం తగినంత నిద్ర యోగ మరియు ధ్యానం వంటివి మనసు ప్రశాంతంగా శరీరాన్ని ఆరోగ్యకరంగా ఉంచేందుకు సహాయపడతాయని విద్యార్థిని విద్యార్థులు చిన్నతనం నుండి ఆరోగ్య సంబంధిత అలవాట్లను వాకింగ్, యోగ మరియు ధ్యానం వంటివి అలవాటు చేసుకోవడం వలన హుషారుగా ఉత్సాహంగా ఉల్లాసంగా మంచి విజయాలు సాధించవచ్చు అన్నారు. శారీరిక మరియు మానసిక శ్రేయస్సు మంచి ఆరోగ్యం తోపాటు శారీరక మరియు మానసిక ఆరోగ్యం ఉంటుందన్నారు. మన జీవన శైలి బాల్యం నుండే మారాలని రోజుకో 30 నుండి 45 నిమిషాలు వ్యాయామం 7 నుండి 8:00 నిద్ర మరియు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శ్రేయస్సును పెంచుకోవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జ్ ఎంపీడీవో రామమోహన్, మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి, మండల వైద్యాధికారి కే శ్రీనివాసరావు, ఎంఈఓ సుధాకర్, శంకరరావులు, హెచ్ఎం రంగా శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి గ్రామంలో లేగదూడల ప్రదర్శన





**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** ఏపీ పశుసంవర్ధక శాఖ , పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంఘం, రాష్ట్రీయ గోకుల్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో దూడల ప్రదర్శన కొత్తపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎన్. చిన నరసింహులు మాట్లాడుతూ వెయ్యదూడలను పోషించుకోవడంలో రైతులు తీసుకోవలసిన మెలకువలను తెలియజేశారు. వెయ్యదూడల వీర్యం పశుసంవర్ధక శాఖ ద్వారా అందుబాటులో ఉందని రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కొని పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యనిర్వహణాధికారి డాక్టర్ నాగభూషణం మాట్లాడుతూ ఏడాదికి ఒక దూడ అది కూడా పెయ్య దూడ ద్వారా రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవచ్చని తెలియజేశారు. గన్నవరం ఇన్చార్జ్ ఉప సంచాలకులు డాక్టర్ పి చంద్రమోహన్ ఈ లేగదూడల ప్రదర్శనలో పాల్గొన్న 38 దూడలలో విజేతలను ఎంపిక చేశారు. కన్నెగంటి శివకృష్ణ దూడ మొదటి బహుమతి, వల్లూరిపల్లి రామకృష్ణ ప్రసాద్ దూడ రెండో బహుమతి, అక్కినేని రవికుమార్ దూడ మూడో బహుమతికి ఎంపిక కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాపులపాడు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం ప్రమీలారాణి, రేమల్లె పశువైద్యాధికారిణి డాక్టర్ ఎం సుధారాణి, మొబైల్ వాన్ పశు వైద్యాధికారి డాక్టర్ మౌనిక, విజయ డైరీ పాలకేంద్రం ప్రెసిడెంట్ శ్రీమతి వల్లూరిపల్లి వెంకటలక్ష్మి , నరసమ్మ, గ్రామ టిడిపి నాయకులు వల్లూరుపల్లి నాగరామకృష్ణ ప్రసాద్, అక్కినేని రవికుమార్, కోరం రూబేను రాజు, ఎల్ ఎస్ ఏ రామకృష్ణ, ఏహెచ్ఎలు దివ్య, జిలాని, కిషోర్ రైతు సోదర సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# జె ఇ ఇ మెయిన్ లో సత్తా చాటిన చైతన్య ఎ/సి విద్యార్థులు

● విజయవాడ విద్యా సంస్థలతో ధీటుగా అత్యుత్తమ ఫలితాలుసాధించిన చైతన్య ఎ/సి క్యాంపస్

● విద్యార్థులకు ఘన సన్మానం చేసిన ఎమ్మెల్యే సౌమ్య



**నందిగామ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** 2026 సంవత్సరానికి గాను నిర్వహించిన జె ఇ ఇ మెయిన్ ఫలితాలలో నందిగామ చైతన్య ఎ/సి క్యాంపస్ విద్యార్థులు అద్భుత ప్రతిభను సాధించారు. విజయవాడలోని ప్రముఖ విద్యా సంస్థలతో సమానంగా పోటీపడి, నందిగామ చైతన్య ఎ/సి క్యాంపస్ విద్యార్థులు అత్యుత్తమ శాతం మార్కులతో సత్తా చాటారు. ముఖ్యంగా పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి నందిగామకు గర్వకారణమయ్యారు.ఈ ఫలితాలలో ఎం మురళీధర్ రెడ్డి -- 99.21 (పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా ఫస్ట్), ఎ జయ సాహితి -- 98.66,జె సాయి శ్రీహర్ష -- 98.21,వి హేమంత్ సాయి -- 97.81, ఎస్ హనుమాన్ రెడ్డి97.49,ఎం శ్రావణి -- 97.80, జి చైతన్య -- 97.37, బి శ్రీనివాస్ -- 96.04 శాతం వంటి అద్భుత ఫలితాలు సాధించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మంగళవారం తమ కార్యాలయంలో కళాశాల యాజమాన్యంతో కలిసి ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా అభినందించారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల మార్గదర్శకం వల్లే ఈ గొప్ప విజయం సాధ్యమైందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన ప్రణాళిక, కఠిన శ్రమతో జాతీయ స్థాయి పోటీల్లో అగ్రస్థానాల్లో నిలవగలరని ఈ ఫలితాలు నిరూపించాయని ఆమె అన్నారు.భవిష్యత్తులోనూ నందిగామ విద్యార్థులు మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రేమాంజలి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ




**పెడన,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** ప్రేమాంజలి సోషల్ సర్వీస్ సెంటర్ పెడనలో మూడు నెలల నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. టైలరింగ్ బ్యూటీషియన్ కోర్సు కంప్యూటర్ శిక్షణ, డ్రైవింగ్ మరియు విద్యార్థుల కోసం సాయంత్రపు కోచింగ్ తరగతులు ఐదు కేంద్రాల్లో నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం స్వయం ఉపాధిని ప్రోత్సహించడం. ఈ నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో భాగంగా, 16 ఫిబ్రవరి 2026న పెడనలోని ప్రేమాంజలి సోషల్ సర్వీస్ సెంటర్లో కుట్టు యంత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. విజయవాడ దయాసిస్ బిషప్ జోసెఫ్ తెలగతోటి పేద కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి ఆసక్తి చూపారు. విజయవాడ దయాసిసన్ సోషల్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా సాధికారత ప్రాజెక్ట్ కింద 15 అర్హులైన కుటుంబాలకు 15 కుట్టు యంత్రాలు అందజేయబడినవి.లబ్ధిదారులైన మహిళలు ప్రేమాంజలి సోషల్ సర్వీస్ సెంటర్లో శిక్షణ పొందారు. విజయవాడ దయాసిసన్ సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవ. ఫా. సునీల్ కార్యక్రమాన్ని ప్రారంభించి కుట్టు యంత్రాలను పంపిణీ చేశారు. ప్రేమాంజలి సమన్వయకర్తలు సిస్టర్ ఫెల్సీ సిస్టర్ ప్రేమ మహిళలను కొత్త అవకాశాలను సృష్టించుకోవాలని వాటిని సద్వినియోగం చేసుకుని కుటుంబ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు

# రైతులు ఆగిపొమ్మంటే ఆగే వ్యవసాయ మోటార్

● సరికొత్త టెక్నాలజీ కనిపెట్టిన అమెరికన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు





**మాచర్ల (కారెంపూడి),ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** పల్నాడు జిల్లా మాచర్ల, కారెంపూడిలోని అమెరికన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారు.రైతులు ఆగిపొమ్మంటే ఆగేపోయే వ్యవసాయ మోటార్ ని కనిపెట్టారు. గ్రామాల్లోని రైతులు ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రిళ్ల వరకూ పొలంలోనే వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉంటారు.సాగునీటి వ్యవస్థలు సక్రమంగా లేకపోవటంతో ఎక్కువగా పంటలు కరెంట్‌తో నడిచే వ్యవసాయ మోటార్లతో సాగవుతున్నాయి.కరెంటు ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియదు.ఇలాంటి పరిస్థితుల్లో కొన్నిసార్లు రాత్రిళ్లు కూడా కరెంటు ఉంటే రైతులు ఆ సమయాల్లో కూడా పొలాలకు వెళ్లాల్సివుంటుంది.తమ ఇంట్లో తల్లిదండ్రులు పడుతున్న అవస్థలు , పరిసర ప్రాంతాల్లోని రైతుల దయనీయ పరిస్థితులను గమనించిన ఈ విద్యార్థులు ఏదో ఒకటి చేసి రైతుల కష్టాలకు చెక్ పెట్టాలని భావించారు. రైతుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని 'ఆఫ్‌లైన్ వాయిస్ కమాండ్స్ కంట్రోల్ ఫీల్డ్ మోటార్'ను రూపొందిం చారు.ఈ సరికొత్త పద్ధతితో రైతులు స్విచ్ బోర్డ్ దగ్గరకు వెళ్లకుండా కేవలం మాటల ద్వారా మోటార్‌ను ఆన్, ఆఫ్ చేయగలగటం ఇందులో ముఖ్యమైన అంశం.సాధారణంగా పొలాల్లో మోటార్ ఆపరేట్ చేయడానికి రైతులు నేరుగా స్విచ్‌ను తాకాల్సి వస్తుంది. వర్షం, తడి నేల, తడి చేతులు వంటి పరిస్థితుల్లో విద్యుత్ షాక్ ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయి. ప్రతి సంవత్సరం అనేక మంది రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో, ఈ వాయిస్ ఆధారిత నియంత్రణ వ్యవస్థ ఒక భద్రతా పరిష్కారంగా నిలుస్తోంది.ఇది ఎలా పనిచేస్తుందంటే ఈ వ్యవస్థలో ప్రత్యేక వాయిస్ గుర్తింపు మాడ్యూల్ ఉపయోగించేలా ఏర్పాటు చేశారు.ముందుగా 'మోటార్ ఆన్', 'మోటార్ ఆఫ్' వంటి కమాండ్స్‌ను రికార్డు చేశారు. రైతు ఆ కమాండ్ పలికిన వెంటనే మాడ్యూల్ శబ్దాన్ని గుర్తించి రీలే ద్వారా మోటార్‌కు సిగల్‌ను పంపుతుంది. దీంతో మోటార్ ఆటోమేటిక్‌గా ఆన్ లేదా ఆఫ్ అవుతుంది. ముఖ్యంగా ఈ వ్యవస్థ ఇంటర్నెట్ లేకుండానే పనిచేయడాన్ని ప్రయోగాత్మకంగా ప్రాజెక్టుగా చేసి చూపించారు. ప్రాజెక్ట్ రూపకర్తల ప్రకారం ఈ మోడల్ ను తక్కువ ఖర్చుతో తయారు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా అమలు చేయటానికి వీలుగా ఉండేలా ఏర్పాటుచేశారు. రాత్రి సమయంలో లేదా ప్రమాదకర వాతావరణంలో కూడా ఇది సురక్షితంగా పనిచేస్తుంది. పరీక్షల్లో ఈ వాయిస్ కమాండ్ వ్యవస్థ అధిక శాతం సరిగ్గా స్పందించినట్లు గుర్తించారు.భవిష్యత్తులో దీనికి మట్టి తేమ సెన్సర్లు, ఆటోమేటిక్ నీటిపారుదల వ్యవస్థలు,సౌరశక్తి సదుపాయాలు జోడించే అవకాశముందని ప్రాజెక్టు రూపకర్తలైన ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న భవిష్య, దివ్య, హేమంత్ నాగ సాయి, భాను నాగ ప్రణవ్, శ్రీ పావని, అజయ్, సుమంత్, చందన ప్రియ, యువశ్రీ లక్ష్మి, కవిష్ తెలిపారు. అమెరికన్ ఇంటర్నేషనల్ కారెంపూడి వ్యవస్థాప కులు జక్కిరెడ్డి కృష్ణారెడ్డి, సిఇఒ జక్కిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సహాయ సహకారాలతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లుగా వివరించారు. స్మార్ట్ టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న ఈ సమయంలో వాయిస్ కమాండ్ మోటార్ నియంత్రణ వ్యవస్థ రైతుల ప్రాణాలను కాపాడే వినూత్న పరిష్కారంగా నిలుస్తుందని ఈ ప్రాజెక్టు పనితీరును వీక్షించిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఘనంగా కె.సి.ఆర్.జన్మదిన వేడుకలు.



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 17(వార్తాప్రభ):**శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ మాధవరం కాలనీ డివిజన్ పార్టీ కార్యాలయం దగ్గర మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ శిల్పి, దూరదృష్టి గల నాయకుడు, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన సందర్భంగా స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల తో కలిసి కేక్ కట్ చేసి కేసీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పట్టుదల, త్యాగం, అంకితభావం చిరస్మరణీయం. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించింది. రైతులకు, మహిళలకు, పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారు. ఆయన చూపిన అభివృద్ధి దిశలోనే మేము పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి కట్టుబడి ఉన్నాము అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల పెద్దభాస్కర్ రావు,మాచర్ల భద్రయ్య, ఆంజనేయులు,బాబూరావు పవీణ్,విక్రమ్,ఈశ్వర్,వెంకట్ రెడ్డి,శ్రీనివాస్,రమణ రెడ్డి,రాజు,సిల్వర్ మనీష్, సత్యనారాయణ ,బాబు, రామచందర్, సోమయ్య,కొండలరావు, అనిల్ ,లక్ష్మణ్ ,నరసింహ రెడ్డి,వాసు,విద్యాసాగర్, రామారావు,శ్రీధర్ ,వెంకన్న,శేఖర్, రాము,శ్రీధర్ రావు,మురళి,రాజశేఖర్, వెంకటేశ్వర రావు,జై,కుమార్ యాదవ్,శ్రీనివాస్, ,వాసు,విజయ్ సాగర్,కిషన్ ,సోమేష్,రాజు,కేబుల్ రమేష్, రవీందర్, అరవింద్,నరేష్, సంతోష్, రామ్మూర్తి, రాజుయాదవ్,బిందెల్ రాము,శ్రీనివాస్ యాదవ్, సంతోష్, జగదీష్,నవీన్, వినయ్, మోహన్ చారి,రాము,సంతోష ,అనిత, శైలజ, రాధిక, కరుణ, అనురాధ,శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో కోలన్ హన్మంత్ రెడ్డి వివాహ వార్షికోత్సవ వేడుకలు



**కుత్బుల్లాపూర్/బాచుపల్లి, ఫిబ్రవరి 17, (వార్తాప్రభ) :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుభాకాంక్షల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనను శాలువాతో సత్కరించారు. పార్టీ శ్రేయస్సుకు నిరంతరం కృషి చేస్తున్న కోలన్ హన్మంత్ రెడ్డి కి నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయుష్షు, ఆరోగ్యం, రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో ఉత్సాహంగా సాగింది.

## ఘనంగా కేసీఆర్ 72వ జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 17, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట డివిజన్ లాస్ట్ బస్టాప్ వద్ద తెలంగాణ రాష్ట్ర సాధకులు, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 72వ జన్మదిన వేడుకలు మంగళవారం నాయకులు, కార్యకర్తల నడుమ ఘనంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ జగన్ హాజరయ్యారు. ఆయన కేక్ కట్ చేసి, అనంతరం పండ్లు పంపిణీ చేస్తూ కేసీఆర్ నాయకత్వాన్ని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర చిరస్మరణీయమని, ఆయన దీర్ఘాయుష్షుతో ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, రుద్ర అశోక్ (మాజీ అధ్యక్షులు), మల్లేష్ గౌడ్, బొగ్గుల సురేష్, మల్లారెడ్డి, కొలుకుల జైహింద్, వేణు యాదవ్, పాపయ్య గౌడ్, విట్టల్ ముదిరాజ్, గిరి, నాగరాజు, మహేందర్ రెడ్డి, సాజిత్, మనోజ్, బసవేశ్వర్ గణేష్, సంపత్ రెడ్డి, సునీల్ రెడ్డి, రాయి విగ్నేష్, భోగ రాజేష్, మహేష్, మనోజ్ ప్రభాకర్, రామరాజు తదితర నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, స్థానిక ప్రజలు కూడా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి 74వ జన్మదిన సందర్భంగా ఆయన నివాసంలో కలిసి శాలువతో ఘనంగా సత్కరించి కేక్ కట్ చేయించి పుష్ప గుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మరియు మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. **జవహర్ నగర్, ఫిబ్రవరి 17:(వార్తా ప్రభ)**

# తెలంగాణ జాతిపిత కేసీఆర్ జన్మదిన వేడుకలు!!

**అనాధాశ్రమంలో సేవా కార్యక్రమాలు**
**కార్పొరేటర్ల ఆధ్వర్యంలో బియ్యం, పండ్ల పంపిణీ**

**పెద్దపల్లి/గోదావరిఖని: ఫిబ్రవరి 17 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణ జాతిపిత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలు తబిత అనాధాశ్రమంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని 28వ డివిజన్ కార్పొరేటర్ దారంగుల కుమార్, 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి సంయుక్త ఆధ్వర్యంలో అనాధ పిల్లలకు బియ్యం, పండ్లను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కౌశిక లత కేసీఆర్ చిత్రపటానికి నివాళులర్పించి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయన పోషించిన చారిత్రాత్మక పాత్రను, ఆయన దార్శనికతను కొనియాడారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ



అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్, శివరాత్రి గంగాధర్, మద్దికుంట శంకర్, కత్తెరమల్ల నర్సింగ్, కలవల శ్రీనివాస్, లక్ష్మణ్, జరుపల శ్రీనివాస్ మరియు కుక్క గంగ ప్రసాద్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతు బాంధవుడు కేసీఆర్!!

- తెలంగాణ ఆత్మగౌరవానికి చిరునామా
- ప్రజల గుండెల్లో నిలిచిన మహానేత బాపు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 17 (వార్తాప్రభ ప్రతినిధి)**రైతు బాంధవుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి కొనియాడారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ జాతిపిత కెసిఆర్ జన్మదిన సందర్భంగా రామగుండం నియోజకవర్గం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, విహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పేదలకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి కెసిఆర్ పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించి, స్వాభిమానాన్ని శ్వాసగా మార్చుకున్న మహానేత కేసీఆర్ అని, ఆయన ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం దేశానికే దిశానిర్దేశం చేసిందని హరీష్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ ఆత్మగౌరవానికి చిరునామాగా నిలిచిన కెసిఆర్, పేదల పక్షపాతిగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో బాపుగా చిరస్థాయిగా నిలిచిపోయారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన రైతు బాంధవుడిగా కెసిఆర్ సేవలను స్మరించుకుంటూ, నియోజకవర్గ ప్రజల తరపున ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో టిబిజికెఎస్ నాయకులు మాదాసి రామ్మూర్తి, వడ్డేపల్లి శంకర్, పార్టీ ప్రతినిధులు జాహీద్ పాషా, తస్లీమ్ భానుతో పాటు మాజీ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సాగించిన పోరాటం అనంతర అభివృద్ధి పనుల వల్ల కెసిఆర్ నాయకత్వం కోసం ప్రజలు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారని నాయకులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. పేద ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న ఆత్మీయ నాయకుడికి నీరాజనాలు అర్పిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా అందరినీ ఆకట్టుకుంది. ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు తెలంగాణ అస్తిత్వానికి కెసిఆర్ పట్ల ప్రజలకున్న గౌరవానికి ప్రతీకగా నిలిచాయి. చివరగా నాయకులందరూ కెసిఆర్ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఈ జన్మదిన వేడుకలను దిగ్విజయం చేశారు.

# మల్లెపల్లి ప్రభాకర్, సంపంగి పద్మ, నకిరకంటి చిట్టిబాబు లను పార్టీ నుండి బహిష్కరణ

**- పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి.**



**జవహర్ నగర్, ఫిబ్రవరి 17:(వార్తా ప్రభ)**మూడు సంవత్సరాల కిందట సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీలో విలీనమైన క్రాంతి పార్టీకి చెందిన మల్లెపల్లి ప్రభాకర్, పార్టీ కార్యదర్శిగా ఉంటూ పార్టీ రాజకీయ, నిర్మాణ వ్యతిరేక పనివిధానానికి పాటుపడుతున్న క్రమంలో సోమవారం రోజు పార్టీ నుండి, పార్టీ భాధ్యతల నుండి తొలగించడం జరిగిందని పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి మంగళవారం రోజు పంపిన పత్రిక ప్రకటనలో వెల్లడించారు. పార్టీలో ప్రభాకర్ అరాచక చర్యలకు వంతపాడుతున్న పిఓడబ్ల్యూ(విముక్తి) జాతీయ కన్వీనర్ సంపంగి పద్మలతో పాటు తెలంగాణ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి చిట్టిబాబు లను చంద్రపుల్లారెడ్డి పార్టీ, ప్రజా సంఘాల నుండి భహిష్కరణకు గురిచేస్తున్నామని ప్రకటించారు. పార్టీ శ్రేణులు, ఇలాంటి రాజ్యం ఏర్పాటు చేసిన విప్లవ వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. వీరు చేసే తప్పుడు ప్రకటనలను, ప్రచారాలను నమ్మరాదని కోరారు. ఇటీవల సిరిసిల్ల పోలీసులు అరెస్టుచేసిన నకిలీ నక్సలైట్ల ఘటన నేపథ్యంలో తీవ్రంగా బెంబేలెత్తిపోయి, చివరికి అందరికి అందరు అధికార, ప్రతిపక్ష కాంగ్రెస్, బీ.ఆర్.ఎస్. పార్టీలలోకి వెళ్ళడానికి సిద్దపడ్డారని అన్నారు. ఇలాంటి నేడు అసలైన చంద్రపుల్లారెడ్డి పార్టీ వారసులుగా చెప్పుకొంటూ, నిజామాబాద్, అదిలాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట తధితర ప్రాంతాల్లో పార్టీ పేరుచెప్పి అక్రమ దందాలు, ఆర్థిక వసూళ్లకు పాల్పపడ్డారని ఆరోపించారు. ఇలాంటి విప్లవ ప్రతిఘాత శక్తులు పనిగట్టుకుని చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు చెప్పారు. లేనియెడల విప్లవ ప్రజానీకమే తగిన బుద్ది చెప్తుతారని ఈసందర్భంగా హెచ్చరించారు. పార్టీ, ప్రజాసంఘాలకు చెందిన శ్రేణులు అన్నిరకాల దిగజారి చేస్తున్న ఇలాంటి చౌకబారు, నీతిబాహ్య ప్రచారాలను ఎప్పటికప్పుడు ముక్త కంఠంతో ఖండించాలని సూచించారు.

# చింతల్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ కలకలం ఏసీబీ అధికారుల అదుపులో టాక్స్ ఇన్స్పెక్టర్!

- టాక్స్ ఇన్స్పెక్టర్ వాహిద్ జేబులో లభ్యమైన భారీ నగదు.
- కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో గంటల తరబడి విచారణ.
- అధికారుల సోదాలతో ఉలిక్కిపడ్డ మున్సిపల్ సిబ్బంది.

**కుత్బుల్లాపూర్/చింతల్, ఫిబ్రవరి 17, (వార్తాప్రభ) :**జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని చింతల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో అవినీతి జరుగుతుందన్న పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ బృందం, చింతల్ సర్కిల్లో టాక్స్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న వాహిద్ ను అదుపులోకి తీసుకున్నారు.

**జేబులో భారీగా నగదు లభ్యం?**విశ్వసనీయ సమాచారం ప్రకారం, వాహిద్ జేబులో అనధికారికంగా ఉన్న భారీ మొత్తంలో నగదును అధికారులు గుర్తించారు. ఈ నగదుకు సంబంధించి సరైన లెక్కలు లేకపోవడంతో అధికారులు ఆయనను కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలోని సమావేశ మందిరానికి తరలించి సుదీర్ఘంగా విచారిస్తున్నారు. ఈ సోదాల వార్త బయటకు పొక్కడంతో కార్యాలయంలోని ఇతర సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు.




పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

## హయత్‌నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా: మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.



**ఎల్బీనగర్/ వార్తప్రభ (ఫిబ్రవరి 17):** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శాంతివనం,ఉషోదయ కాలనీవాసులు స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్.రెడ్డిని ఘనంగా సన్మానించారు.గత ఐదేళ్లలో కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ రహదారులు, డ్రైనేజ్ వ్యవస్థలు, వీధి దీపాలు, పారిశుధ్య సమస్యల పరిష్కారం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ భేదాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజల ప్రేమాభిమానాలు తనపై మరింత బాధ్యతను పెంచుతున్నాయని, భవిష్యత్తులో కూడా హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని నవజీవన్ రెడ్డి గారు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ
హైదరాబాద్

## సిద్దార్థ కళాశాలలో ఫేర్వెల్ డే వేడుకల్లో అంబరాన్నంటిన సంబరాలు

**జ్యోతి ప్రజ్వలన చేసిన గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు.**
**యువత కేరింతలతో కేక పుట్టించారు**





**కూకట్ పల్లి, ఫిబ్రవరి 17(వార్తాప్రభ):**విద్యారంగం లో అద్భుతమైన ట్రాక్ రికార్డు కు కేరాఫ్ అడ్రస్ గా ఉన్న కూకట్ పల్లి సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాల ఫేర్వెల్ పార్టీ సంబరాలు అశోక్ గార్డెన్స్ లో ఆదరహో అనిపించాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా కళాశాల చైర్మన్ జి.నాగయ్య తో పాటు ప్రెసిడెంట్ జి.భాస్కర్ రావు, డైరెక్టర్స్ ఇ.మధుసూదన్ రావు, ఎస్.అరవిందరావు, ప్రిన్సిపాల్స్ ఎ.పద్మ ప్రియ,ఎన్.చంద్రశేఖర్ నాథ్ లు పాల్గొన్నారు. అనంతరం ఈ కార్యక్రమం లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందచేశారు.ముఖ్య అతిధులు అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కు దిశా నిర్దేశం చేశారు.కొత్త విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్య క్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో యువతీ,యువకులు,కళాశాల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## బాలనగర్ లో మాజీ సీఎం కెసిఆర్ జన్మదిన వేడుకలు.



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 17(వార్తాప్రభ):**కూకట్ పల్లి నియోజకవర్గం బాలనగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.మంగళవారం బాలనగర్ బిఆర్ఎస్ కార్యాలయం వద్ద సీనియర్ బిఆర్ఎస్ నాయకురాలు ఎడ్ల కవిత పార్టీ నాయకులతో కలిసి కెసిఆర్ పుట్టినరోజు సందర్భంగా కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి కి కేక్ కట్ చేసి తినిపించారు.ఈ సందర్భంగా ఎడ్ల కవిత మాట్లాడుతూ కెసిఆర్ హయాంలో తెలంగాణ చాలా అభివృద్ధి చెందిందని ప్రస్తుతం కాంగ్రెస్ గవర్నమెంట్ లో ఎలాంటి హామీలు నేర్వేదకపోవడంతో ప్రజలు మళ్ళీ కేసీఆర్ ఏ సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి,సీనియర్ బిఆర్ఎస్ మహిళా నాయకురాలు ఎడ్ల కవిత మహంకాళి,సూరి, కవిత,కార్తికేయ,ప్రభాకర్,శ్రీనివాస్ యాదవ్ బిఆర్ఎస్ నాయకులు, మహిళలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లేక ప్రజల ప్రాణాలకు ముప్పు.

**- మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.**



**ఎల్బీనగర్/వార్తప్రభ(ఫిబ్రవరి 17):**హయత్‌నగర్‌లో జాతీయ రహదారి విస్తరణ పూర్తయినా ప్రజల భద్రత కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయకపోవడం ఆందోళనకరమని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డిపో సమీపంలో వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.అదేవిధంగా శ్రీనివాస, శాంతివనం, ఉషోదయ కాలనీల ప్రజలు ఆయనను సన్మానిస్తూ గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్ కాలనీలో భూగర్భ డ్రైనేజ్ పనులను కూడా ఆయన పరిశీలించి, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా సేవే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ,స్థానిక ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## లోకల్ ఫైట్ : అతి పెద్ద డైలమాలో వైసీపీ ?

ఏపీలో స్థానిక సంస్థల సమరానికి తెర లేస్తోంది. అధికార టీడీపీ కూటమి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికలను నిర్వహించాలని పట్టుదలగా ఉంది. మొత్తం ఎన్నికల ప్రక్రియను అంతా జూన్ నాటికి పూర్తి చేయాలని కూడా ఒక డెడ్ లైన్ పెట్టుకుంది అని అంటున్నారు. ఏపీ బడ్జెట్ సైతం స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ రూపొందించారు అని అంటున్నారు. ఒక చూస్తే ఏపీలో రాజకీయ వాతావరణం కూడా కూటమికి అనుకూలంగా ఉంది అని అంటున్నారు.అంతే కాదు పొరుగున ఉన్న తెలంగాణా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు పూర్తిగా అధికార కాంగ్రెస్ కి అనుకూలంగా వచ్చాయని కూడా గుర్తు చేస్తున్నారు. అదే మాదిరిగా ఏపీలో కూడా మంచి ఫలితాలు తాము సాధిస్తామని కూటమి నేతలు మంచి నమ్మకంతో ఉన్నారు. కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసి గెలిచిందని మూడు పార్టీల కూటమి ఫుల్ స్ట్రాంగ్ గా ఉందని పైగా వైసీపీ పెద్దగా సంస్థాగతంగా పుంజుకోలేదని కూడా కూటమి పెద్దలు అంచనా కడుతున్నారు. దాంతో ఇపుడు ఎన్నికలు పెడితే నూరు శాతం సీట్లను గెలుచుకోవచ్చు అన్నది వారి ఆలోచనగా ఉంది. అదే సమయంలో స్థానిక పదవులు మూడు పార్టీలు పంచుకోవడం ద్వారా గ్రౌండ్ లెవెల్ లో మరింత గట్టిగా నిలిచేందుకు వీలు కలుగుతుందని కూడా అంచనా వేస్తున్నారు ఇక విపక్షంలో ఉన్న వైసీపీ స్థానిక సంస్థల విషయంలో తర్జన భర్జన పడుతోంది అని అంటున్నారు. దానికి కారణాలు ఉన్నాయి. ఎక్కడైనా స్థానిక ఫలితాలు అధికార పార్టీకే అనుకూలంగా ఉంటాయని అంటున్నారు. తాజాగా తెలంగాణాలో జరిగినది కూడా అదే అని అంటున్నారు. 2021లో వైసీపీ కూడా ఇదే రకమైన ఫలితాలను అందుకుందని ఇపుడు ప్రతిపక్షంలో ఉండడం చేత ఇబ్బందులు వస్తాయని అంటున్నారు. పోటీ చేసి ఓటమి చెందామని అనిపించుకోవడం కంటే బాయ్ కాట్ చేసి గమ్మున ఉండడం వల్ల గౌరవంగా ఉంటుందా అన్న ఆలోచన కూడా పార్టీలో జరుగుతోంది అని అంటున్నారు. ఈ విషయంలో తర్జన భర్జన పడుతున్నారని అంటున్నారు. అయితే మరో వైపు చూస్తే పోటీకి దిగాల్సిందే అన్న మాట కూడా వినిపిస్తోంది. అవుట్ రేట్ గా అధికార పార్టీకి వదిలేస్తే వైసీపీ క్యాడర్ డీ మోరలైజ్ అవుతుందని అంటున్నారు. అంతే కాకుండా క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు డీలా పడతారని ఆ ఫలితాల ప్రభావం సార్వత్రిక ఎన్నికల్లో కూడా కనిపిస్తుందని అంటున్నారు. దాదాపుగా రెండేళ్ళ పాలన పూర్తి చేసుకున్న కూటమి మీద ప్రజా వ్యతిరేకత ఉందని గట్టి అభ్యర్థులను పెట్టి చిత్తశుద్ధితో పోరాడితే వైసీపీకి మేలు జరుగుతుందని వాదించే వారూ ఉన్నారని అంటున్నారు. తెలంగాణాలో ఎంత అధికార కాంగ్రెస్ గెలిచినా బీఆర్ఎస్ అలాగే బీజేపీ సైతం చెప్పుకోదగిన ఫలితాలను సాధించాయని గుర్తు చేస్తున్నారు. పైగా క్యాడర్ గేరప్ అయిందని ఏపీలో వైసీపీకి కూడా ఇది చాలా అవసరం అని అంటున్నారు. అయితే ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకోవాల్సింది అధినాయకత్వం అని అంటున్నారు. పల్లె పోరుతోనే : ఇక ఏపీలో స్థానిక సమరం పల్లె పోరుతో మొదలై కార్పోరేషన్ పోరుతో ముగుస్తుందని అంటున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిపించాలని చూస్తున్నారు. ఆ మీదట జిల్లా మండల పరిషత్తులకు, చివరిగా మునిసిపాలిటీలకు కార్పోరేషన్లకు ఎన్నికలు పెట్టాలని అనుకుంటున్నారు. బడ్జెట్ సెషన్ పూర్తి అయిన తరువాత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల మీద పూర్తి స్థాయిలో ఫోకస్ పెడుతుందని అంటున్నారు.

## ప్రజల ఆర్థిక అభివృద్ధికి యు సి డి విభాగం కృషి చేయాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల ఆర్థిక అభివృద్ధికి యు సి డి విభాగం కృషి చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ విభాగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అక్షరాంధ్ర, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, ప్రధానమంత్రి స్వా నిధి, షెల్టర్ హోమ్స్, వీధి విక్రయదారుల స్థితిగతులు అంశాలపై సర్కిల్ వారీగా సమీక్షించారు. వచ్చేవారం కల్లా వీటన్నిటి పై పురోగతి ఉండాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేందుకు అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ విభాగం ప్రధాన పాత్ర పోషిస్తుందని, నగర ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు కచ్చితంగా ఉండేటట్టు చూసుకోవాలని, యు సి డి సిబ్బంది అందుకు అనుగుణంగా విస్తృతమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం. విజయలక్ష్మి, సిడి వోలు శ్రీకాంత్, జగదీశ్వరి, ఉమామహేశ్వరి, టెక్నికల్ ఎక్స్పర్టు సుజాత, శేఖర్ మరియు యు సి డి సిబ్బంది పాల్గొన్నారు.

## పుస్తక పఠనం శ్రేష్టము



పుస్తకాన్ని చేతిలో
జ్ఞానాన్ని మెదడులో
నింపుకో వేగిరమే
వెలుగునోయ్! మస్తకమే
అక్షరాల వెన్నెల్లో
గడపాలోయ్! హాయిగా
విజ్ఞానపు వీధుల్లో
విహరించాలోయ్! గొప్పగా
పొత్తము హస్త భూషణము
పరికింపగ ఆనాడు
పోయెను గత వైభవము
చరవాణే ఈనాడు
ఆరోగ్య దాయకమే
పుస్తకాల పఠనమే
మానసిక ఎదుగుదలకు
జీవితాన ఎదిగేందుకు

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు, ఎమ్మిగనూరు,సెల్:9966414580

## రాణి గారి తోట లోగల వాటర్ ట్యాంక్ నీరు ను ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోండి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాణి గారి తోట లోగల నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ ను త్వరగా పూర్తిచేసి, అందుబాటులో తీసుకొచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా రాణి గారి తోట, కృష్ణలంక ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాణి గారి తోట లో నిర్మిస్తున్న 1000 కి.లీ . సామర్థ్యం గల రిజర్వాయర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి, డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ను ఏర్పాటు చేసి ప్రజలకు త్వరగా మంచినీటి సరఫరా ఆ ట్యాంకు ద్వారా అందుబాటులోకి రావాలని అధికారులను ఆదేశించారు. అమృత్ 2.0 పథకం కింద చేస్తున్న ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యం



కల్పించాలని అన్నారు. కృష్ణలంక నేషనల్ హైవే లో గ్రీన్ బెల్ట్ ను పెంచాలని ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణ అందించేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి రాణి గారి తోటలో గల అన్న క్యాంటీను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి, వాడుకనీటి సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఏవైనా మరమ్మతులు ఉన్నచో వెంటనే వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే షమ్మీ, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## రగ్బీలో ఎం.ఎస్.ఆర్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

**విజయవాడ పశ్చిమ,ఫిబ్రవరి 17:-(వార్తా ప్రభ ప్రతినిధి)** ఈ నెల 15 వ తేదీన గన్నవరం బాలుర జెడ్పి హైస్కూల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా రగ్బీ అసోసియేషన్ వారు నిర్వహించిన మూడవ జిల్లా స్థాయి రగ్బీ ఛాంపియన్షిప్ పోటీలలో కొత్తపేటలోని ఎం.ఎస్.ఆర్ హైస్కూల్ విద్యార్థులు అత్యద్భుత ప్రతిభ కనబరిచి పలు బహుమతులు సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి. శ్యామల చెప్పారు. గెలుపొందిన విద్యార్థులకు సోమవారం పాఠశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండర్- 12 విభాగంలో ఉమ్మడి కృష్ణాజిల్లా రగ్బీ టోర్నమెంట్ కమ్ జిల్లా జట్టు ఎంపికలలో ఎం ఎస్ ఆర్ హై స్కూల్ బాలికలు ప్రథమ స్థానం మరియు బాలురు తృతీయ స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. అదేవిధంగా ఎం ఎస్ ఆర్ స్కూల్లో జరిగే వివిధ రకాల క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ కమిటీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. రామారావు, ప్రెసిడెంట్ మద్ది సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ సేగు. రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ పి. శైలజ, ట్రెజరర్ జె. శ్రీనివాస్ , విజయం సాధించిన విద్యార్థులను, విజయానికి కీలక పాత్ర పోషించి అంకితభావంతో కూడిన శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. మధుని ప్రత్యేకంగా అభినందించారు.

## బీసీల రిజర్వేషన్లకు ఆద్యుడు భారతరత్న కర్పూరి ఠాగూర్

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భారతదేశంలో తొలిగా కాంగ్రెసేతర పార్టీ నుంచి ముఖ్యమంత్రి అయిన ఘనత బీహార్ మాజీ ముఖ్యమంత్రి భారతరత్న కర్పూరి ఠాకూర్ కు చెందుతుందని, అదేవిధంగా ఓబీసీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన ఉన్నత కులాల వారికి కూడా రిజర్వేషన్ ఇవ్వాలని తొలిగా ప్రతిపాదించిన ఘనత కూడా ఆయనకే చెందుతుందని రిటైర్డ్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎం రవీంద్రనాథ్ బాబు వ్యాఖ్యానించారు. కర్పూరి ఠాగూర్ వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. నవ్యాంధ్ర రాజధానిగా పేరుగాంచిన విజయవాడ నగరంలో కర్పూరి ఠాగూర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓబీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్ విధానాన్ని కర్పూరి ఠాగూర్ ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నగర బిసి సంఘం సీనియర్ నాయకులు దాలిపర్తి ధన్వంతరి మాట్లాడుతూ కర్పూరి ఠాగూర్ విజయవాడ విచ్చేసిన సందర్భంగా తాను ఆయనతో కలిసి ప్రయాణం చేశానని బీహార్ నుండి ఆయన కేవలం ఒక జత బట్టలతో విచ్చేసిన నిరాడంబరుడు అని ఆయనతో కలిసి ప్రయాణం చేసిన అంశాలను గుర్తు చేసుకున్నారు. సభను నిర్వహించిన సీనియర్ పాత్రికేయులు, సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అన్నవరపు బ్రహ్మయ్య మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో ఉన్నత విద్యకు ఆటంకంగా మారిన ఇంగ్లీష్ సబ్జెక్టును పదవ తరగతి పరీక్షలలో మినహాయించటం ద్వారా



బడుగు వర్గాల చెందిన విద్యార్థులు ఉన్నత విద్య చదివే అవకాశం కల్పించిన ఘనత ఠాకూర్ కు చెందుతుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్కాపురం కనకారావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నాయి బ్రాహ్మణులలో సామాజిక విద్య సంబంధ విషయాలలో చైతన్యం కలిగించడానికి వీలుగా భారతరత్నం కర్పూరీ ఠాకూర్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పొట్లూరి వెంకటేశ్వరరావు, సంక్షేమ సంఘం నాయకులు రిమ్మనపూడు బ్రహ్మేశ్వర రావు, కనుపర్తి జానకిరావు, తెన్నేటి ప్రకాశరావు, తెన్నేటి సోము తదితరులు మాట్లాడారు.

## నగరాభివృద్ధిలో ముస్లింల పాత్ర మరువలేనిది

**● ముస్లిం పేద మహిళలను ఆదుకునేందుకు సహకారం అందిస్తాను ● రంజాన్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి ● 400 మంది పేదలకు రూ.2,500 విలువ గల రేషన్ కిట్స్ పంపిణీ**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా మర్కజ్ ఇమామ్ ఇబ్నే బాజ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సోసైటీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ మొహమ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం పంజా సెంటర్ వద్ద గల షా జహర్ ముసాఫిర్ ఖానాలో పేద ముస్లిం మహిళలకు రేషన్ కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్ హాజరై ముస్లిం మహిళలకు రేషన్ కిట్స్ పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ ఫతావుల్లా పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 400 మంది ముస్లిం పేదలకు రూ. 2,500 విలువ గల రేషన్ కిట్స్ పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సోసైటీ చేస్తున్న సేవలను కొనియాడారు. మర్కజ్ ఇమామ్ ఇబ్నే బాజ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సోసైటీకి తన పూర్తి సహకారం వుంటుందని , ఇటువంటి సోసైటీలు దేశ అభివృద్ధికి దోహదపడతాయన్నారు. రంజాన్ మాసం బుధవారం నుంచి ప్రారంభం కానున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం




సోదరలంతా రంజాన్ మాసంలో దేశ అభివృద్ధి కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రార్థనలు చేయాలని ఆకాంక్షించారు. ఆటోమొబైల్ రంగంలో ముస్లిం సోదరుల పాత్ర ఎంతో వుందని, నగరాభివృద్ధిలో వారి పాత్ర మరువలేనిదన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం మైనార్టీలకు అండగా వుంటుందని స్పష్టం చేశారు. అలాగే ముస్లిం పేద మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించే విధంగా తోడ్పాడు అందించాలని మర్కజ్ ఇమామ్ ఇబ్నే బాజ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సోసైటీ నిర్వాహకులకు ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. గత ఏడాది కాలం నుంచి మహిళలకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేశినేని ఫౌండేషన్ ద్వారా ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి సహాయ సహకారాలు అందిస్తానని సోసైటీ నిర్వాహకులకు తెలిపారు. ముస్లిం సమాజ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.. ఈ కార్యక్రమంలో మర్కజ్ మజీద్ ఇమామ్ మౌలానా అబూ హోరేరా మదని, తెలుగు ప్రసంగికులు మౌలానా రబ్బాని, హనీఫ్ లతో పాటు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## భూమి సరిహద్దు వివాదంలో ముద్దాయిలకు రెండు ఏళ్ళ జైలు శిక్ష

**6 వేలు జరిమానా విధించిన న్యాయస్థానం**

**రౌతులపూడి ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రౌతులపూడి మండలం డీజే పురం గ్రామంలో 2015 సంవత్సరంలో భూమి సరిహద్దు వివాదంలో అల్లు సింహాద్రి అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన ఈశ్వర్ అప్పారావు రాజుపేట గ్రామానికి చెందిన గింజాల సత్తిబాబు గింజల కృష్ణ గింజల అప్పారావు సింహాద్రి అనే వ్యక్తిపై ఇనుపరాడులతో దాడి చేసి గాయపరిచారని అప్పుడు ఎస్సై జగన్మోహన్ కి ఫిర్యాదు చేయగా ముద్దాలపై కేసు నమోదు చేశారు. తుని జుడిషియల్ న్యాయస్థానం ఈరోజు వాదాప వాదాలు విన్న తర్వాత ముద్దాయిలకు శిక్ష ఖరారు చేసినట్టు న్యాయస్థానం తెలిపిందని ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలను సారం పెద్దాపురం ఎస్డిపిఓ హరిరాజు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సిఐ సూరి అప్పారావు , రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు ఆదేశాలతో న్యాయస్థాన కానిస్టేబుల్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ కేసులో ప్రభుత్వ ఇరువాదనలు విన్న న్యాయస్థానం తుని గౌరవ జ్యుడీషియల్ మొదటి మేస్త్రి వి గోపాలకృష్ణ ముద్దాయిలకు ఈ శిక్ష విధించినట్టు పి పి. లక్ష్మీదేవి న్యాయస్థానాలకి వాదన వినిపించడం జరిగిందని అదేవిధంగా ఎస్పీ జి. బిందు మాధవ్ ట్రయల్ కేసుల మీద ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు మీడియా సమావేశంలో తెలిపారు.

## పంజా సెంటర్లో నీలోఫర్ హలీం అండ్ బిర్యాని సెంటర్ ప్రారంభం




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 17: (వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోనిస్థానిక పంజా సెంటర్ లోని హాజీయ ఫంక్షన్ హాల్ లో రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటుచేసిన నీలోఫర్ హలీం అండ్ బిర్యాని సెంటర్ ను మంగళవారం ఉదయం విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాద్ మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా ఇక్కడ హలీం సెంటర్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. నీలోఫర్ హలీమ్ అండ్ బిర్యాని సెంటర్ అధినేత ఎండి భాషా మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా హైదరాబాద్ రుచులతో మంచి బలవర్ధకమైన పోషక విలువలు ఉన్న హలీం, హైదరాబాద్ స్పెషల్ మటన్ మరక్, రుమాలి రోటి, మటన్ బిర్యానీ తదితర రకాల ఆహార పదార్థాలను ముస్లిమ్ సోదరులకు, విజయవాడ నగర ప్రజలకు అందించాలని సంకల్పంతో ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రంజాన్ మాసం నెలరోజులపాటు ఈ సెంటర్ ను ఇక్కడ నిర్వహిస్తామని, ఏసీ సిట్టింగ్ తో ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన వివరించారు. అత్యంత నాణ్యతతో రుచితో తాము హలీం తదితర పదార్థాలను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మైనార్టీ నాయకులు మొహమ్మద్ ఫతావుల్లా తదితరులు పాల్గొన్నారు.

## కోటి రూపాయలు సంపాదించినా పేద వారి ఆకలి తీర్చిన సంతృప్తి ఉండదు - కొరగంజి జగన్



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కోటి రూపాయలు సంపాదించినా పేద వారి ఆకలిదప్పులు తీర్చిన సంతృప్తి వుండదని అందుకే తాను ఎంత సంపాదించినా పేదవారి ఆకలి తీర్చడానికి ముందుంటానని కోరగంజి జగన్ (కే ఎస్ జగన్) అన్నారు. కొరగంజి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ కె.ఎస్.జగన్ ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య పుణ్య కాలంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దానిలో భాగంగా మంగళవారం వందలాది మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ కె.ఎస్.జగన్, పోతిన వరప్రకాష్ కొరగంజి. చక్రవర్తి,పొట్నూరి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా కే ఎస్ జగన్ మాట్లాడారు. తన ట్రస్ట్ ఆధ్వర్యంలో త్వరలోనే “”మహా ప్రస్థానం”” వాహనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. పేదవాడి అంతిమయాత్ర ఖర్చులు తగ్గించి సదరు కుటుంబ సభ్యులకు ఆర్థిక బాధలు లేకుండా తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## వ్యక్తిగత పరిశుభ్రతతో నులిపురుగుల సమస్య దూరం






**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వ్యక్తిగత పరిశుభ్రతతో నులిపురుగుల సమస్య దూరం అవుతుందని విజయవాడ నగరపాలక అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం కే బి సి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పటమట లో విద్యార్థినీ విద్యార్థులకు జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా వారికి నులిపురుగు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు నులిపురుగుల వల్ల శరీరానికి జరిగే నష్టాలు, శరీరంలోకి నులిపురుగులు రావటానికి ముఖ్య కారణం అపరిశుభ్రంగా ఉండటం అని, చేతిలో ఉన్న వేళ్ళకు గోళ్లు తీయకపోవడం, ఆహారం సేవించేటప్పుడు చేతులను పరిశుభ్రంగా కడుక్కోకపోవటం వలన నులిపురుగులు శరీరంలోకి వస్తాయని, అవి మన శరీరంలోకి ప్రవేశించిన తర్వాత మన శరీరానికి అన్ని విధాలుగా నష్టం కలిగిస్తాయని, రక్తహీనత, నీరసం, నిరుత్సాహం వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు అందరికీ అవగాహన కల్పించి వారి ఇంటి మొత్తంలో కూడా నులిపురుగుల మందు తీసుకోటానికి ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, కేబీసీ పాఠశాల హెడ్ మాస్టర్ వి. వి. ని సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిహారిక, ఎ ఎన్ ఎమ్ లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధిత కోర్టు ఉద్యోగి కి లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ చేయూత.

**మచిలీపట్నం ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం నియోజకవర్గం పోతేపల్లి గ్రామంలో జిల్లా కోర్టు ఉద్యోగి అర్జా లక్ష్మి ఇల్లు ఆదివారం సాయంత్రం గ్యాస్ లీకేజ్ తో ఇల్లు మొత్తం కాలిపోయింది. సుమారు 7 లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది.అర్జా లక్ష్మి తన భర్త సుబ్బారావు ముగ్గురు చిన్నపిల్లలతో కాపురం ఉంటుంది. గ్యాస్ లీకేజీతో ఇల్లు మొత్తం కాలిపోయి కట్టుబట్టలతో ప్రాణాలతో బయటపడ్డారు. మంగళవారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ న్యాయవాది లంకి శెట్టి బాలాజీ బాధిత కుటుంబానికి నిత్యవసర వస్తువులు, బియ్యం బట్టలు, వంట సామాగ్రి, 5,000 రూపాయలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ గతంలో ఇల్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ పరంగా ఇచ్చే 5,000 రూపాయలు రద్దుచేసి కేవలం 25 కేజీలు బియ్యం ఇవ్వటం సమంజసం కాదని అన్నారు. నిజమైన అగ్ని బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా పక్కా ఇల్లు నిర్మించి లక్ష



రూపాయలు బ్యాంకు రుణం మంజూరు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. బాధిత కుటుంబానికి మచిలీపట్నంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలని బాలాజీ కోరారు. రాబోయే వేసవికాలం పురస్కరించుకొని నగర ప్రజలు విద్యుత్తు షార్ట్ సర్క్యూటివ్ గ్యాస్ లీకేజీ పట్ల అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలను నివారించుకోవాలని బాలాజీ అన్నారు. మచిలీపట్నం చుట్టుపక్క ప్రాంతాలలో అగ్ని ప్రమాద బాధితులకు గత 15 సంవత్సరాలుగా అండగా ఉంటున్న లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సేవలు ఆదర్శప్రాయమని మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పోతేపల్లి జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ తోట రాజేష్, మాజీ గ్రామ సర్పంచ్ శ్రీపతి చంద్రం, తమన్నఆదిత్య పోతేపల్లి సచివాలయం ఉద్యోగి ప్రభు ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు

## శివాలయంలో అన్నదానం



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(వార్తా ప్రభ ప్రతినిధి):** మహాశివరాత్రి సందర్భంగా ఇబ్రహీంపట్నం ఫెర్రీ శివాలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య పాల్గొన్నారు. శివాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు అభిషేకాలు నిర్వహించి జంపాల సీతారామయ్య కు ఆశీర్వచనాలు,ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నదానం చేశారు జంపాల.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా ప్రతి సంవత్సరం ఆనవాయితీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని...ఆ మహా శివుని అనుగ్రహం అందరిపై ఉండాలని.. ఆయన ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని శివుని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మొబైల్ మిస్సింగ్ కేసు లో రికవరీ

**పిర్యాదు దారునికి మొబైల్ అందజేసిన ఎస్ఐ అర్జున్....**



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 17( వార్త ప్రభ )** గౌరవ కమిషనర్ అఫ్ పోలీస్ విజయవాడ సిటీ వారి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న మొబైల్ మిస్సింగ్ పోర్టల్ సెయిర్ ద్వారా పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ ఎస్ ఐ అర్జున్ ఫిర్యాది అయినటువంటి ఉసిరిగంటి వెంకటేశ్వర్లు, తండ్రి రాములు వారి యొక్క మొబైల్ ఫోన్, రికవరి చేసి వారికీ మంగళవారం ఎస్ ఐ అర్జున్ అందచేయడం జరిగింది.

## ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ని మర్యాదపూర్వకంగా కలిసిన. బీజేపీ నేత జొన్నాడ రంజిత్



**విజయనగరం,ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయనగరం జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం నందు మంగళ వారం ఈడీ వెంకటేశ్వర రావు ను మర్యాదపూర్వకంగా జిల్లా బిజెపి నేతలు కలిశారు. ఈడి తో పలు అంశాలపై చర్చించి మళ్లీ ఎస్సీ కార్పొరేషన్ లోన్లు పునరుద్ధరించాలని ఈడీ ని కోరడం జరిగినది. ఎస్సీ కార్పొరేషన్ లోన్లు ఇస్తే జిల్లాలో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే నిరుద్యోగ బృతి తగ్గుతుందని కోరడం జరిగినది దీనికి ఈడి సానుకూలంగా స్పందించి గవర్నమెంట్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో విజయనగరం భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు బూసరి గౌరీ శంకర్, రాజాం నియోజకవర్గం టౌన్ ప్రెసిడెంట్ జొన్నాడ రంజిత్, మోర్చా నాయకులు కౌలు మురళి తదితర కార్యకర్తలు, నాయకులు పాల్గొనడం జరిగినది.

## విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు పై రైతులకు అవగాహన



**చేజర్ల ఫిబ్రవరి 17 (వార్తాప్రభ)** చేజర్ల మండల పరిధిలోని నెర్నూరు చిత్తలూరు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి పి.ఎస్ హిమబిందు మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమము నిర్వహించుట జరిగినది.ఈ కార్యక్రమంలో భాగంగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు యొక్క ఉపయోగాలు రైతులకు తెలియజేశారు.నెర్నూరు చిత్తలూరు గ్రామాలలో ఏఆర్ఎస్ సైంటిస్ట్ సురేఖ జొన్న శెనగ పొలాలను పరిశీలించి క్లస్టర్ డెమోన్ నిర్వహించి రైతులకు తగు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది.అదేవిదంగా పంట నమోదు ఆవశ్యకత తెలిపి రైతులు సకాలంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి సహకరించి పంట నమోదు చేసుకోవాలని రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది నాగభూషణం ఝాన్సీ రైతులు పాల్గొన్నారు.

## క్రీడలు మన జీవితంలో చాలా ముఖ్యమైనవి.....

**అడిషనల్ ఎస్పీ, సత్యనారాయణ.**
**జిల్లా స్పోర్ట్స్ అథారిటీ జిల్లా అధికారి,**

**మచిలీపట్నం ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కె. ఝాన్సీ లక్ష్మి ఆధ్వర్యంలో 45వ డివిజన్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు మంగళవారం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో చాలా ముఖ్యమైనవి అని, మన ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా క్రమశిక్షణ మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి అన్నారు. చెస్ ఒక మేదస్సు ఆధారిత ఆట అన్నారు. ఇది మన ఆలోచన శక్తిని, సహనాన్ని మరియు నిర్ణయ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తుంది అన్నారు. చెస్ ద్వారా మనం ముందు చూపుతో ఆలోచించడం నేర్చుకుంటాం అన్నారు. చెస్ పోటీలలో ప్రముఖ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథ్ ఆనంద్ ప్రపంచ ఖ్యాతి పొందారు అన్నారు. అలాంటివారిని స్ఫూర్తిగా తీసుకుని ఆటలో ముందుకు వెళ్లి పోటీలో విజయం సాధించాలి అన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో అవసరం, అందరూ రోజు కొంత సమయం క్రీడలకు కేటాయించాలి అన్నారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్ హాజరై మాట్లాడుతూ.....మంత్రి కొల్లు రవీంద్ర క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని, యువత కోసం యువతరంగాలు, బీచ్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలు పెట్టి మంత్రి కొల్లు రవీంద్ర క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహించారని, అలాగే మచిలీపట్నంలో క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కలుగచేయడానికి మంత్రి కొల్లు రవీంద్ర విశేష కృషి చేస్తున్నారు అన్నారు. జిల్లా క్రీడా అధికారి కె. ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూరాష్ట్రస్థాయి చెస్ పోటీల ఎంపికలో భాగంగా జిల్లా స్థాయిలో చెస్ పోటీలలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 155 మంది యువత చెస్ పోటీలలో



పాల్గొన్నారు అని తెలిపారు.జిల్లా స్థాయిలో జరిగిన చెస్ పోటీలలో 16 మంది యువత రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు విజేతలుగా ఎంపికయ్యారని, ఈ రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో ఎంపికైన వారు ఈనెల 21, 22 తేదీలలో తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు వారిని పంపించడం జరుగుతుంది అన్నారు. ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది అని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి, కె. ఝాన్సీ లక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్, హాసీం బేగ్, రాష్ట్ర శిష్ట కరణం సాధికార సమితి కన్వీనర్, అక్కుమం తి రాజా, తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం నగర కార్పొరేషన్ అధ్యక్షుడు, లోగి శెట్టి వెంకటస్వామి, జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్, అజీమ్, ప్రముఖ న్యాయవాది, అమర్, చెస్ ఆర్గనైజేషన్ ఆర్బిట్రేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు ఆల్బెండజోల్ మందులు వేసిన చైర్మన్



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(వార్తా ప్రభ ప్రతినిధి):**జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కొండపల్లి మునిసిపాలిటీ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండపల్లి పురపాలక చైర్మన్ మరియు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు పాల్గొన్నారు.విద్యార్థులకు నులిపురుగుల మందు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10 మరియు ఆగస్టు 10న నిర్వహిస్తారని, సంవత్సరం పిల్లల నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలలో పేగు పురుగులను నిర్మూలించడానికి, రక్తహీనతను తగ్గించడానికి మరియు వారి శారీరక మానసిక వికాసాన్ని పెంపొందించడానికి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ చేపట్టిన అతిపెద్ద ప్రజారోగ్య కార్యక్రమం చేపట్టిందని తెలిపారు.అంగన్వాడీలు, పాఠశాలల్లో ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో కొండపల్లి మునిసిపాలిటీ కమిషనర్ వెంకటరత్నం, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అఫ్సర్, కౌన్సిలర్ ఉప్పుతల గోపాలరావు, పులి, మెడికల్ సిబ్బంది, పాల్గొన్నారు. **కాచవరం పాఠశాలలో** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కాచవరం పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. కేతనకొండ గ్రామ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్పందన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరఫరా చేసిన ఆల్బెండజోల్ ఐ.పి 400 మి.గ్రా మాత్రలను పంపిణీ చేసి స్వయంగా వేయించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులి పురుగులు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. నులి పురుగుల వల్ల రక్తహీనత, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, పొట్ట నొప్పి, అలసట, చదువులో ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు కలుగుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మొహమ్మద్ ఇర్ఫాన్ పాషా, ఎన్ఎం శివ పార్వతి, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు లేని యువతిని టార్గెట్ చేసి ఏడేళ్ల మోసం కైకలూరులో కలకలం.

**5 లక్షల కట్నం,బంగారం తీసుకుని 7 ఏళ్ల సహజీవనం**
**ఇప్పుడు పెళ్లి మాట తప్పిన ప్రియుడు**
**"నీకు తల్లిదండ్రులు లేరు.ఏం చేసుకుంటావో చేసుకో**
**యువతిని అవమానించిన కుటుంబం.**



**కైకలూరు, ఫిబ్రవరి 17 (వార్తా ప్రభ)** కైకలూరులో జరిగిన ఈ ఘటన మహిళల భద్రత, న్యాయం పై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఐదు లక్షల రూపాయల కట్నం, బంగారం తీసుకుని ఏడు సంవత్సరాల పాటు యువతితో సహజీవనం చేసిన యువకుడు ఇప్పుడు పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తూ మాట తప్పడం సంచలనంగా మారింది.పెద్దల సమక్షంలోనే పెళ్లి ఒప్పందం జరిగి కట్నం ఇచ్చిన విషయం వాస్తవమేనని మసీదు పెద్దలు వెల్లడించారు.చేసుకుంటానని చెప్పి ఏడు సంవత్సరాలు కలిసి జీవించిన విషయం నిజమే" అని పెద్దలు స్పష్టం చేసినప్పటికీ, యువకుడు మాత్రం బాధ్యత నుంచి తప్పించుకుంటున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు నచ్చజెప్పి మాట్లాడినా అతడు తన వైఖరి మార్చుకోలేదని పెద్దలు తెలియజేశారు.ఇక యువకుడి తల్లిదండ్రుల ప్రవర్తన మరింత ఆగ్రహం రేపుతోంది. బాధిత యువతిని తీవ్రంగా నిందిస్తూ "నీ చేతనైంది చేసుకో" అని చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. యువకుడు కూడా "నీకు తల్లిదండ్రులు లేరు.ఏం చేసుకుంటావో చేసుకో. నిన్ను చేసుకోను" అంటూ అవమానకరంగా మాట్లాడినట్లు యువతి కన్నీటి పర్యంతమైంది.తన బలహీనతను ఆసరాగా చేసుకుని జీవితం నాశనం చేశాడని, ఇప్పుడు సమాజంలో నిలబడలేని పరిస్థితి



తీసుకొచ్చాడని యువతి వేదన వ్యక్తం చేసింది. న్యాయం కోసం యువకుడి ఇంటిముందు ధర్నాకు దిగిన ఆమె "నన్ను వెంటనే పెళ్లి చేసుకోవాలి.లేకపోతే చట్టపరంగా పోరాటం చేస్తాను" అని స్పష్టం చేసింది.కట్నం తీసుకుని, ఏళ్ల తరబడి సహజీవనం చేసి ఇప్పుడు మాట తప్పడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.బాధితురాలికి తక్షణ న్యాయం చేయాలని, మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.బాధిత యువతికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని యువతి, పెద్దలు తెలియజేశారు.

## విజయ డంకాను మ్రోగించిన వికాస్



**విస్సన్నపేట ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండలంలోని జె ఈ ఈ మెయిల్ ఫలితాలలో వికాస్ జూనియర్ కాలేజీ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినందుకు వికాస్ విద్యా సంస్థల అధినేత నర్రెడ్ల నర్సిరెడ్డి వాళ్లకి ప్రత్యేక ప్రసారం తెలియజేశారు.పలగాని పూర్ణ అనిల్ కుమార్– 91.30 కె. మనోజ్ కుమార్ రెడ్డి – 84.50పులివర్తి లిఖిత సాయి – 75.90బి. కావ్య -- 75.89లింగంపల్లి దివ్య – 72.49మంచి పర్సెంటైల్ సాధించిన విద్యార్థులను ఆయనతో పాటు ప్రిన్సిపాల్ సీతారామరాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, ఐఐటీ ఇన్చార్జ్ ప్రవీణ్ కుమార్, బాలికల విభాగం ఇన్చార్జ శంకర్రావు, సీనియర్ ఐఐటీ అధ్యాపకులు బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ





**చేజర్ల ఫిబ్రవరి 17 (వార్తాప్రభ)** జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 01 నుంచి 19 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు ఆల్ బెండజోల్ మాత్రలను మింగించడం జరిగినది.అలాగే చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 3942 మంది పిల్లలకు గాను 3745 పిల్లలకు మాత్రలను మింగించడం జరిగినదని చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ మెహతాబ్ తెలిపారు.ట్యాబ్లెట్ మింగని పిల్లలకు ఈ నెల 24 రోజున మరలా ట్యాబ్లెట్ మింగించడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు బోడిపాడు లుంబిని విద్యాలయం మరియు మడపల్లి ఎంపీపీ పాఠశాలలను సందర్శించి అక్కడ సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.అలాగే పి.హెచ్.సి వైద్యాధికారి అంశుధర్ మాముదూరు అగ్రహారం పాఠశాలను సందర్శించి పిల్లలకు ట్యాబ్లెట్ లను మింగించడం జరిగినది.ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఒ. మరియు పిహెచ్ఎన్ మరియు ఆరోగ్య సహాయకులు అరుణ చిన్నయ్య మరియు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## బందరు ఎంపీ చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సాయం.





**మచిలీపట్నం ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి సహాయంతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి విడుదలైన మొత్తం ?2,96,888 ఆర్థిక సాయాన్ని అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే భావనతో, అవసరమైన ప్రతి కుటుంబానికి వైద్య సహాయం అందేలా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఈ సాయం అందించారు.సహాయం అందించిన లబ్ధిదారుల వివరాలు పెడన నియోజకవర్గం, కోకా నారాయణ పాలెం, గూడూరు గ్రామానికి చెందిన బేబీ ఆఫ్ పగడాల నాగిని (చైల్డ్) కు –2,47,904.బంటుమిల్లి గ్రామానికి చెందిన దక్కుమళ్ల అభిలాష్ కు –?48,984 రూపాయలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం వారికి కొంతమేర ఊరటనిస్తుందని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సిద్ధాంతంతో ప్రతి అర్హుడికి సహాయం అందేలా తాను ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య, ఆర్థిక సమస్యలను గుర్తించి, వారికి త్వరితగతిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు

**ప్రవేశ దరఖాస్తులకు ఎల్లుండి ఆఖరు తేదీ**

**గన్నవరం, ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గన్నవరం నియోజకవర్గం వీరపనేని గూడెంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుండి ఇంటర్ మొదటి ఏడాదిలో ప్రవేశాలకు ప్రకటన విడుదలైందని డిసిఓ మురళి కృష్ణ , పాఠశాల ప్రిన్సిపాల్ గిరి కుమారి తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఫిబ్రవరి 19వ తేదీ వరకు http://apbrgcet.apcfss.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకోసం ?100 ప్రవేశ రుసుము నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. ఈ ప్రవేశాలు రిజర్వేషన్ల ప్రాతిపదికన జరుగుతాయని, ఇందులో ఎస్సీ కేటగిరీకి 75 శాతం (ఎస్సీ--1 5%, ఎస్సీ--2 32.5%, ఎస్సీ--3 37.5%), ఎస్టీలకు 6 శాతం, బిసిలకు 5 శాతం, బిసి--సిలకు 11 శాతం, మరియు ఓసిలకు 3 శాతం సీట్లు కేటాయిస్తారని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

## ఫార్మసీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(వార్తా ప్రభ ప్రతినిధి):** స్థానిక నిమ్రా ఫార్మసీ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న ఫార్మసీ విద్యార్థులకు ట్రైనింగ్ మరియు ప్లేస్మెంట్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో గైడెన్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విషన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి వినయ్ తేజ మాట్లాడుతూ విద్యార్థులకు క్లినికల్ రీసెర్చ్, క్లినికల్ డేటా మేనేజ్మెంట్ పై శిక్షణ ఇచ్చారు. ఫార్మా మరియు క్లినికల్ రీసెర్చ్ క్షేత్రాల్లో విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలతో సామర్థ్యవంతులను చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. డేటా నిర్వహణ టెక్నిక్స్, ట్రయల్స్లో గణాంక విశ్లేషణకు ప్రోగ్రామింగ్ వంటి కీలక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జనార్దన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ కృష్ణ, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ రవికుమార్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## జెఇఇ మెయిన్స్ ఫలితాలలో 'శ్రీ అగస్త్య' హవా

### మ్యాథ్స్ లో 100/100 మార్కులతో సత్తా చాటిన నందసాయి రెడ్డి






**కాకినాడ, ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సోమవారం విడుదలైన జెఇఇ మెయిన్స్ సెషన్-1 ఫలితాలలో 'శ్రీ అగస్త్య' విద్యాసంస్థల విద్యార్థులు విజయదుందభి మోగించినట్లు డైరెక్టర్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు (డిఎన్ఆర్) ఒక ప్రకటనలో తెలిపారు. జెఇఇ మెయిన్స్ సెషన్-1 ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీ అగస్త్య విద్యార్థుల వివరాలను వెల్లడించారు.ఎ.నంద సాయిరెడ్డి 99.94 పర్సంటైల్, పి. రుత్విక్ సుజయ్ 99.83 పర్సంటైల్, కె.మణివర్మ 99.56 పర్సంటైల్, సిహెచ్. షణ్ముఖ సాత్విక్ 99.39 పర్సంటైల్ తో ముందు వరుసలో ఉండగా మరో ఆరుగురు విద్యార్థులు 99, 98 పర్సంటైల్ సాధించి దేశంలోని ప్రసిద్ధ ఎన్ఐటి, ఐఐఐటిలలో సీట్లు సాధించడానికి అర్హత సాధించారన్నారు. తమ విద్యార్థులలో ఎ.నంద సాయిరెడ్డి 300మార్కులకు 238 మార్కులతో 99.94 పర్సంటైల్ సాధించడంతో పాటు మ్యాథ్స్ లో 100కి 100 మార్కులు సాధించిన ఘనత 'శ్రీ అగస్త్య' కే దక్కుతుందన్నారు. అలాగే జెఇఇ మెయిన్స్ సెషన్-2లో మరింత మంది విద్యార్థులు మంచి పర్సంటైల్ సాధించేందుకు గాను ప్రణాళికబద్ధమైన విద్యాబోధన చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, అధ్యాపకులకు అభినందనలు తెలియజేసి శ్రీ అగస్త్య విద్యాసంస్థలపై నమ్మకంతో గత నాలుగు సంవత్సరాలుగా తమను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.జెఇఇ మెయిన్స్ సెషన్-1 ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, అధ్యాపకులకు శ్రీ అగస్త్య విద్యాసంస్థల కో-ఆర్డినేటర్ అల్లుమల్లు ఏలియా, అకడమిక్ డైరెక్టర్లు సురేష్, శ్రీపల్లవి, ప్రిన్సిపాల్స్, బోధన మరియు బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి ఊరేగింపు



**విస్సన్నపేట ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండలంలోని కొండ పర్వ గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి గ్రామ సర్పంచ్ గొట్టి పూళ్ల రమేష్ బాబు నివాస ప్రాంగణం నుండి ఊరేగింపుగా బయలుదేరింది. ప్రతి ఇంటి ప్రాంగణం నందు ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో ఆది దంపతులైన శ్రీ భ్రమరాంబిక మల్లేశ్వర స్వామి వార్లకు పూజలు నిర్వహించి లడ్డు ప్రసాదాన్ని అందుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ చైర్మన్ గొట్టిపూళ్ల బుచ్చి వెంకట రామలక్ష్మి నరసింహారావు( బుచ్చినాయన )గ్రామ సర్పంచ్ జి రమేష్ బాబు, సహకార సంఘం మాజీ అధ్యక్షులు జి చంద్రశేఖర్ వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, మట్టా వేణుగోపాలరావు, పి మహేష్, బి ఎస్ నారాయణ పలువురు గ్రామ పెద్దలు ఊరేగింపులో పాల్గొన్నారు.

## ఈరోజు ఆలపాడు,కొల్లేటికోటలో మంత్రి కందుల దుర్గేష్,ఎమ్మెల్యే కామినేని పర్యటన.

**ఆలపాడులో శంఖుస్థాపన, కొల్లేటికోటలో విగ్రహాలు గోకర్ణపురంలో పార్టీ దిమ్మ కార్యక్రమం.**

**కైకలూరు, ఫిబ్రవరి 17 (వార్తా ప్రభ)** కైకలూరు నియోజకవర్గంలో పలు ఆధ్యాత్మిక, అభివృద్ధి మరియు రాజకీయ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఆలపాడు గ్రామంలో దాత వానపల్లి బాబురావు ఆర్థిక సహకారంతో కొల్లేటికోట శ్రీశ్రీశ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారి దేవస్థానం ఆర్చి పనుల శంఖుస్థాపన కార్యక్రమం ఘనంగా జరుగనుంది. అదే సందర్భంలో కొల్లేటికోట క్షేత్రంలో శివపార్వతుల విగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు ఆలయ మార్గంలోని సీసీ రోడ్ల ప్రారంభోత్సవం కూడా నిర్వహించబడుతుంది.అదేవిధంగా గోకర్ణపురం గ్రామంలో జనసేన పార్టీ దిమ్మ ఆవిష్కరణ కార్యక్రమం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మరియు కైకలూరు ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్ హాజరుకానున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల కూటమి నాయకులు, జనసేన పార్టీ శ్రేణులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## దుమ్ము, ధూళి నుంచి శాశ్వత పరిష్కారం చూపాలి



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17 (వార్తా ప్రభ ప్రతినిధి):** దుమ్ము, ధూళి సమస్య నుంచి తమకు శాశ్వత పరిష్కారం చూపాలని అరుణా నగర్ ప్రజలు కోరారు. క్వారీ, క్రషర్ లారీల రాకపోకలతో వస్తున్న దుమ్ము, ధూళిని అరికట్టాలని నిర్వహిస్తున్న ఆందోళన మంగళవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుమ్ము, ధూళి నుంచి అరుణా నగర్ ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళన చేస్తున్న కాలనీ వాసులతో మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, కమిషనర్ వెంకట రత్నం చర్చించారు. సమస్యను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సాయంత్రం క్వారీ, క్రషర్ యజమానులు ఆందోళన చేస్తున్న అరుణా నగర్ ప్రజలతో చర్చలు జరుపుతున్నారు. కార్యక్రమంలో అరుణా నగర్ ప్రజలు పాల్గొన్నారు.

# పోరాటాల గడ్డపై.... ఉద్భవించిన వీర పుత్రుడు కెసిఆర్

**● గరీబోళ్ల గుండెల్లో చిరస్థాయిగా కెసిఆర్.● జనహృదయనేత తెలంగాణ జాతిపిత.● ఉద్యమ వీరుడు తెలంగాణ శూరుడు. ● జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య.**



**జవహర్ నగర్, ఫిబ్రవరి 17: (వార్తా ప్రభ)**పోరాటాల గడ్డపై... ఉద్భవించిన వీర పుత్రుడు మన కెసిఆర్ యేనని, గరీబోళ్ల గుండెల్లో చిరస్థాయిగా మాజీ సీఎం కేసీఆర్ నిలుస్తారని కరువు నేలను హరిత తెలంగాణ గా నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందని జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జవహర్ నగర్ అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో తెలంగాణ జాతిపిత మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని మంగళవారం అంగరంగ వైభవంగా కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ మేకల కావ్య హాజరై మాట్లాడుతూ. పోరాటాల గడ్డపై ఉద్యమించిన ఉద్యమ యోధుడు స్వరాష్ట్ర సాధనలో అలుపెరగని ధీరుడు తెలంగాణ రాష్ట్ర తలరాతను మార్చిన నాయకుడు సబ్బండ వర్గాలను అక్కున చేర్చుకొని ఆదరించిన జననేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి మన కేసీఆర్ అని తెలిపారు. ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలోకి నడిపించిన మహానేత మన తెలంగాణ జాతిపిత కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సహకారం చేసిన దూర దృష్టి గల ఏకైక నాయకుడని కేసీఆర్ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందించిన జననాయకుడు అన్నారు. కేసీఆర్ బంగారు తెలంగాణ సాధనలో అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. రైతులు పేద బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన నాయకుడు అన్నారు. తెలంగాణకు గర్వకారణమైన కేసీఆర్ నాయకత్వం చిరకాలంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనతి కాలంలోనే ప్రజా వ్యతిరేకతను చురగొన్నదని త్వరలో రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వం మేనని పార్టీ కార్యకర్తలు అధైర్యపడవద్దని ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సంగీత రాజశేఖర్, వల్లపు రవి, మేడ్చల్ జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు జిట్టా శ్రీనివాసరెడ్డి ,అహ్మద్ పాషా, మహేష్, వెంకటేష్ గౌడ్, సోమయ్య గౌడ్ ,ఎల్ల స్వామి, సిద్ధులు, బి ఆర్ఎస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకట్ నరసయ్య, పరుశురాం, నరసింహ యాదవ్, మహేందర్ యాదవ్, సాయి, సతీష్, కృష్ణ, మంజుల, కేతమ్మ, కొండల్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు తీవ్ర అనర్థాలకు దారితీస్తాయి

**-ఐసీడీఎస్ పీడి రుక్సానా సుల్తానా బేగం**

**కుంటముక్కల డా.బి ఆర్.అంబేద్కర్ గురుకులంలో బాల్య వివాహాల పై విద్యార్థినుల కు అవగాహన**






**జి.కొండూరు:ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, బాల్య వివాహాలు తీవ్ర అనర్థాలకు దారితీస్తాయ ని మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రుక్సానా సుల్తానా బేగం అన్నారు.జి.కొండూరు మండలంలోని కుంటముక్కల గ్రామ శివారు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో మంగళవారం సాయంత్రం మైలవరం ప్రాజెక్టు సిడిపివొ కె. పుష్ప లత ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రుక్సానా సుల్తానా బేగం మాట్లాడుతూ చిన్న వయస్సులో గర్భధారణ వల్ల తల్లి, బిడ్డల మరణాలు, రక్తహీనత, మరియు ప్రసవ సమయంలో తీవ్రమైన సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. బాల్య వివాహాలు వల్ల బాలికలు చదువుకు దూరమవుతారని పేర్కొన్నారు.బాల వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నవంబర్ 26 నుండి మార్చి 8 వరకు అన్ని పాఠశాలు, కాలేజీలు, చర్చిలు, మసీదులు, దేవాలయాలలో బాల్య వివాహాలు గురించి అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగు తుందని వెల్లడించారు.అలాగే పౌష్టిక ఆహారం, రక్తహీనత మరియు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు.పోక్సో మరియు గర్భ లింగ నిర్ధారణ చట్టాలను గురించి వివరించారు. సీడీపీవొ కె.పుష్పలత బాల్య వివాహాల ద్వారా వచ్చే నష్టాలు మరియు సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి యమ్. రాజేశ్వరరావు జిల్లాలో మిషన్ వాత్సల్య స్కీం ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు.బాలల హక్కులు,పరిరక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.వాసవ్య మహిళ మండలి అధికారి హృదయ రాజు బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బ్యూల, జి.కొండూరు, వెలగేరు సెక్టార్ల సూపర్వైజర్లు డి.జోజి కటాక్షం, అన్నమ్మ, అవుట్ రీచ్ వర్కర్లు ధనలక్ష్మి, రాణి, గురుకులం ఉపాధ్యాయులు, అంగనవాడి టీచర్లు పాల్గొన్నారు.

# న్యాయవాదులకు ఇంగ్లీష్ పై పట్టు ఉంటే మరింత అభివృద్ధి సాధ్యం.

**సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ అక్బర్**




**విజయవాడ, ఫిబ్రవరి 17 :(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రముఖ పాత్రికేయులు సయ్యద్ అక్బర్ విజయవాడలో పుట్టి శాతవాహన కాలేజీలో చదువుకొని తదుపరి ఇండియన్ ఎక్స్ ప్రెస్ లో పాత్రికేయులుగా కెరీర్ ప్రారంభించి డెక్కన్ క్రానికల్ మరియు టైమ్స్ ఆఫ్ ఇండియాలో గత నాలుగు దశాబ్దాల నుంచి న్యూస్ ప్రతినిధిగా ఎడిటర్ గా కొనసాగి సేవలందించి పదవీ విరమణ చేసి ఇప్పుడు తాత్కాలికంగా టైమ్స్ ఆఫ్ ఇండియా కి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకి ఎడిటర్ గా, ఇన్చార్జిగా పనిచేస్తూ నేడు బెజవాడ బార్ అసోసియేషన్ కు విచ్చేసి బెజవాడ బార్ అసోసియేషన్ తో ఆయనకి ఉన్న అనుభవాలను అనుబంధాన్ని మరొకసారి గుర్తు చేసుకుంటూ ఇంగ్లీష్ భాష యొక్క ప్రాధాన్యత అవశ్యకతను తెలియజేస్తూ భాష మీద పట్టు లేక ఎంతోమంది ఉద్యోగ అవకాశాలను కోల్పోతూ వెనుకబడిపోతున్నారని ముఖ్యంగా న్యాయవాదులకు సబ్జెక్టుతోపాటు ఇంగ్లీష్ మీద కూడా పట్టు చాలా అవసరం అని ఇంగ్లీషు భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటూ న్యాయవాదులతో ఆయన చదువుకున్నప్పటి అనుభవాలను పంచుకుంటూ అప్పటి ఉద్యోగ పరిస్థితులు ఎలా ఉన్నాయో ఇప్పుడు కూడా ఆ పరిస్థితులు అలానే ఉన్నాయని మనలోని నైపుణ్యతను పెంచుకుంటూ అందరూ సక్సెస్ సాధించాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా బెజవాడ బార్ అధ్యక్షులు శ్రీ ఎ కె బాష ఆయనని సగౌరవంగా సత్కరించారు.

# రోడ్డు ప్రమాదాలపై నివారణ అందరి బాధ్యత

**ట్రాఫిక్ ఏసిపి రామచంద్రరావు**




**ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి 17(వార్తా ప్రభ ప్రతినిధి):**రోడ్డు ప్రమాదాలపై నివారణ అందరి బాధ్యత అని అన్నారు విజయవాడ ట్రాఫిక్ ఏసిపి రామచంద్రరావు. పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు, ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం ఆదేశాల మేరకు, ఏ డి సి పి గుణ్ణం రామకృష్ణ పర్యవేక్షణలో ట్రాఫిక్ ఏసిపి రామచంద్రరావు ఆధ్వర్యంలో పశ్చిమ ఇబ్రహీంపట్నంలో రోడ్డు భద్రత మరియు హెల్మెట్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి వినియోగం, వేగ నియంత్రణ, రోడ్డు భద్రతా నియమాల పాటింపు గురించి అవగాహన కల్పించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీస్తుందని వివరించారు.రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మానవ తప్పిదాల వల్లనే జరుగుతున్నాయని, ప్రతి వాహనదారుడు తన భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకొని వాహనం నడపాలని సూచించారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, నివారణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ ఆర్ ఐ కృష్ణ ,ఆర్ఎస్ఐ లక్ష్మణ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# బి.ఆర్.ఎస్.నేత రవీందర్ యాదవ్ నేతృత్వంలో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుక




**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ):**తెలంగాణ జాతిపితగా అభిమానులు కొనియాడుతున్న కె.చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఒడిశా రాష్ట్రంలోని పూరి సముద్ర తీరాన ప్రత్యేక సైకత శిల్పాన్ని ఏర్పాటు చేశారు.శేరిలింగంపల్లికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు,భారాస సీనియర్ నేత చిర్రా రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ శిల్పాన్ని రూపొందించారు.సైకత శిల్పంపై "ఆయన డిమాండ్ చేశారు -మనం నమ్మాం -తెలంగాణ పుట్టింది - ఒక వాగ్దానం నెరవేరింది" అనే సందేశంతో పాటు"తెలంగాణ రాష్ట్ర ప్రధాత,బంగారు తెలంగాణ నిర్మాత,జనహృదయ నేత,కారణజన్ముడు,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి" వంటి వాక్యాలు చెక్కబడ్డాయి."తెలంగాణ జాతిపిత కేసీఆర్" అనే భావాన్ని ప్రతిబింబించేలా శిల్పాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.తెలంగాణ రాష్ట్ర సాధన స్ఫూర్తిని చాటే ఈ కళాఖండం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.ఈ సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ,తెలంగాణ సాధనతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ముమ్మాటికీ తెలంగాణ జాతిపిత కేసీఆర్ నని,ఆయురారోగ్యాలతో సుదీర్ఘాయుష్మంతుడిగా ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## చిన్ననాటి నుంచే ఆరోగ్య పథంలో పయనించాలి

**జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ**



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 17( వార్త ప్రభ )** విద్యార్థి దశ నుండే ఆరోగ్య సూత్రాలను పాటించటం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన సాధ్యపడుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు.జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పెనుగంచిప్రోలు కె వి ఆర్ జడ్పి హైస్కూల్ లో విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి 1 - 19 సంవత్సరాల వయసున్న పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. చిన్నారుల్లో రక్తహీనత, పోషకాల లోపాలకు కారణమైన నులి పురుగులను నివారించి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు అల్బెండజోల్ మాత్ర ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చిన్నారులు కూడా శుభ్రతకు సంబంధించి మంచి అలవాట్లను పెంపొందించుకోవాలన్నారు. భోజనానికి ముందు, తరువాత, అడుకున్న తరువాత చేతులను బాగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. శరీరంలో నులిపురుగులు ఉండటం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, అందువల్ల జాగ్రత్తగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అన్నారు.ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్ డి ఓ. బాలరాజు మండల తహసీల్దార్. శాంతి లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. జలజ డాక్టర్ నాగరాణి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

## రిసర్వే విధానాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కోదూరు, ఫిబ్రవరి17(వార్తా ప్రభ) :**కోదూరు మండలంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం పర్యటించారు. మండల పరిధిలోని సాలింపాలెం గ్రామంలో రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి రైతుల అభిప్రాయాలను సేకరించారు.రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు అందించారు.

## పూడికతీత తీయించి అక్రమ తూములు తొలగించండి..!



**కోదూరు,ఫిబ్రవరి 17(వార్తా ప్రభ) :**సాలెంపాలెం అవుట్ పాల్స్ స్లూయిజ్ వద్ద నుంచి పిట్టలంక కరకట్ట వెంబడి ఉన్న కరకొడు డ్రైనేజీకి ఆక్వా రైతులు తూములు వేసి పూడ్చుట కారణంగా డ్రైనేజీ పూడిపోయి ఉప్పునీటి ప్రభావానికి 750 ఎకరాల సాగు భూమిలో పంట దెబ్బతింటుందని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులు వారి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

## బాషి హలీమ్ స్టాల్ ను ప్రారంభించిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 17: (వార్తా ప్రభ ప్రతినిధి)**పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా స్థానిక పంజా సెంటర్లో ఏర్పాటుచేసిన జెడ్ అండ్ ఎస్ బాషి హలీమ్ స్టాల్ ను మంగళవారం సాయంత్రం మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ మాసంలో నాణ్యమైన హలీం, సంబంధిత ఆహార పదార్థాలను అందించడం అభినందనీయమని అన్నారు. ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసం ప్రారంభ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హలీం స్టాల్ నిర్వాహకులు బాషి మాట్లాడుతూ తమ హలీంస్టాల్ లో హలీం, రుమాలి రోటి, పాయ, చికెన్ టిక్కా, కెఎఫ్సి, చికెన్ లాలీపాప్ తదితర ఆహార పదార్థాలను సరసమైన రేట్లతో ముస్లిం సోదరులకు అందించడం జరుగుతుందని చెప్పారు. రంజాన్ నెల మొత్తం తాము అత్యంత నాణ్యతతో హలీమ్ స్టాల్ ను నిర్వహిస్తామని బాషి వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ యలకల చలపతిరావు, వైసీపీ నాయకులు కొనకళ్ళ విద్యాధరరావు, బాజీ బాబా తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సమతుల్యతకు, సంస్థాగత నిబద్ధతకు ప్రతీక

**– డా. నూకసాని బాలాజీ**





(పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్)

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో 2024 తర్వాత కొత్త సమీకరణాలు రూపుదిద్దుకుంటున్నాయి. బీసీ ప్రాతినిధ్యం, పార్టీ నిర్మాణంలో కృషి చేసిన నాయకులకు గౌరవప్రద స్థానం, పరిపాలనా అనుభవం ఉన్న వ్యక్తులకు ప్రాధాన్యత– ఇవి రాష్ట్ర రాజకీయ చర్చల్లో కీలక అంశాలుగా మారాయి. ఈ నేపథ్యంలో డా. నూకసాని బాలాజీ గారి పేరు సహజంగానే ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

**టూరిజం రంగంలో దిశా నిర్దేశక నాయకత్వం...** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) చైర్మన్‌గా ఆయన రాష్ట్ర పర్యాటక రంగాన్ని పునర్వ్యవస్థీకరించే దిశగా కృషి చేస్తున్నారు. బీచ్ టూరిజం, దేవాలయ టూరిజం, ఎకో టూరిజం, హార్టి మరియు అగ్రికల్చరల్ టూరిజం, ప్రాంతీయ ప్రత్యేకతల బ్రాండింగ్ వంటి అంశాల్లో ప్రణాళికాబద్ధమైన దృష్టి స్పష్టంగా కనిపిస్తోంది. పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆదాయ వనరుగా మాత్రమే కాకుండా, ప్రజలందరికీ ఉపాధి అవకాశాలు, ఆహ్లాదకర అనుభవాలు కల్పించే శక్తివంతమైన రంగంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మరియు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ బాబు గారి స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధి దిశగా టూరిజం రంగాన్ని మరింత బలోపేతం చేయాలనే దృఢ సంకల్పంతో ఆయన కార్యాచరణ కొనసాగుతోంది.

**జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి - ఒక నిర్మాణాత్మక ప్రయాణం..** 2014--2019 మధ్య ప్రకాశం జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన కాలంలో గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల పెంపు, స్థానిక సంస్థల బలోపేతం వంటి అంశాల్లో చురుకైన పాత్ర పోషించారు. జిల్లా రాజకీయాల్లో స్థిరమైన స్థావరాన్ని ఏర్పరుచుకున్నారు. AP యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా, అలాగే హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డ్ మెంబర్‌గా పనిచేసిన సమయంలో కందుకూరులో హార్టికల్చర్ కాలేజీ స్థాపనకు కృషి చేయడం ఆయన అభివృద్ధి దృక్పథానికి నిదర్శనం.

**పార్టీ నిర్మాణంలో నిబద్ధత..** 2016--2020 మధ్య తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించి సంస్థాగత క్రమశిక్షణను బలోపేతం చేశారు. 2020--2025 మధ్య ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడిగా పార్టీని కింది స్థాయి నుంచి పునర్నిర్మించారు. గ్రామస్థాయి కార్యకర్తలతో నిరంతర అనుసంధానం కొనసాగించడం ఆయన నాయకత్వ శైలిలో ప్రధాన లక్షణం. 2024 ఎన్నికల్లో కమాండ్ కంట్రోల్ రూమ్ వ్యవస్థలో కీలక పాత్ర పోషించి వ్యూహాత్మక సమన్వయాన్ని సమర్థంగా నిర్వహించారు.

**సామాజిక సమతుల్యత - రాజకీయ పరిపక్వత..** ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో బీసీ వర్గాల ప్రాతినిధ్యం ఒక ప్రధాన చర్చా అంశంగా మారింది. ప్రకాశం జిల్లాలో బీసీ వర్గాలకు బలమైన స్వరంగా ఎదిగిన నాయకుడిగా డా. బాలాజీ గారి గుర్తింపు ఉంది. అగ్రవర్ణాలతో సమతుల్య సంబంధాలు కొనసాగిస్తూ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం ఆయన రాజకీయ పరిపక్వతను ప్రతిబింబిస్తుంది. విభజనాత్మక రాజకీయాలకు దూరంగా, సమీకరణ రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఆయన ప్రత్యేకత.

**రాజ్యసభ సందర్భంలో వ్యూహాత్మక విశ్లేషణ..** రాజ్యసభ స్థానాల కేటాయింపు కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు --- అది పార్టీ ఇచ్చే ఒక సామాజిక సందేశం కూడా. ఒక అభ్యర్థిని ఎంపిక చేసే సందర్భంలో సాధారణంగా మూడు అంశాలు పరిగణనలోకి తీసుకుంటారు: పార్టీ పట్ల నిబద్ధత పరిపాలనా మరియు రాజకీయ అనుభవం సామాజిక ప్రాతినిధ్యం ఈ ప్రమాణాల ప్రకారం పరిశీలించినప్పుడు డా. నూకసాని బాలాజీ సహజ ఎంపికగా కనిపిస్తున్నారు.

**అతని ఎంపిక:** బీసీ వర్గాలకు గౌరవప్రద ప్రాతినిధ్యం ఇస్తుంది. పార్టీ కేడర్‌కు నిబద్ధతకు గుర్తింపుగా నిలుస్తుంది. సంస్థాగతంగా కష్టపడి పనిచేసిన నాయకత్వానికి గౌరవం ఇస్తుంది ఇది కేవలం వ్యక్తిగత ప్రోత్సాహం కాదు – సామాజిక సమీకరణకు, పార్టీ నిర్మాణానికి ఇచ్చే గౌరవంగా చూడవచ్చు.

**ముగింపు..** గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిబద్ధతతో ఎదిగిన నాయకత్వం, పరిపాలనా సామర్థ్యం, సామాజిక సమతుల్యత --- ఈ మూడు లక్షణాల సమ్మేళనం డా. నూకసాని బాలాజీ ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.

# నిరుపేదలకు, అనాధలకు భద్రతా భావన కల్పించడమే ధ్యేయంగా..

● రక్షణ వెల్ఫేర్ సొసైటీ, కృష్ణా జిల్లా, గుడివాడ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వారి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ





**గుడివాడ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ యొక్క మహా సంచాలకుల (డైరెక్టర్ జనరల్) పి. వెంకట రమణ యొక్క ఆదేశాల మేరకు రక్షణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యములో కృష్ణ జిల్లా మరియు గుడివాడ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సమాజ సేవలో భాగంగా అనాధలు మరియు నిరాశ్రయులకు దుప్పట్లు మరియు నిత్యవసరాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుడివాడ పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతం, బస్ స్టాండ్ ప్రాంతం, అలాగే అనాధాశ్రమాలలో నివసిస్తున్న వారికి మరియు రోడ్లపై నిద్రిస్తున్న నిరాశ్రయులకు దృష్టిలో ఉంచుకుని దుప్పట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సేవా కార్యక్రమం ద్వారా అగ్నిమాపక శాఖ కేవలం అగ్నిప్రమాదాల సమయంలో మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతను కూడా సమానంగా నిర్వర్తిస్తుందని తెలియజేయడం జరిగింది. నిరుపేదలు మరియు అనాధలకు సహాయం చేయడం ద్వారా వారికి భద్రతా భావన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో గుడివాడ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అందరూ పాల్గొని సేవాభావంతో తమ వంతు సహకారం అందించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని అగ్నిమాపక శాఖ సంకల్పించింది.

# కోనసీమ కుకింగ్ & కేటరింగ్ అసోసియేషన్ నూతన సారథిగా సలాది సూర్యప్రకాశరావు (సూరిబాబు)



**అమలాపురం,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** కోనసీమ కుకింగ్ & కేటరింగ్ అసోసియేషన్ మూడవ సర్వసభ్య సమావేశం అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కోనసీమ జిల్లా నలుమూలల నుండే కాకుండా, పొరుగు జిల్లాల నుండి కూడా కేటరింగ్ వృత్తిదారులు, ప్రముఖులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వృత్తిపరమైన ఐక్యతను చాటుతూ జరిగిన ఈ సమావేశం అసోసియేషన్ బలోపేతానికి వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సలాది సూర్య ప్రకాశరావు (సూరిబాబు), గౌరవ అధ్యక్షులుగా గుడివాడ రామారావు, బోనం కృష్ణ, సెక్రటరీ రావూరి సత్య కిరణ్, కోశాధికారి వేమా నరసింహారావు, వైస్ ప్రెసిడెంట్ యలమంచిలి బాలగంగాధర తిలక్ (వ్యవస్థాపక సభ్యులు)లు ప్రమాణ స్వీకారం చేసారు. సమావేశంలో ప్రధానంగా కేటరింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ముఖ్యంగా ఈ క్రింది అంశాలపై సభ్యులు తీర్మానాలు చేశారు: నాణ్యతా ప్రమాణాలు: మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారులకు నాణ్యమైన, రుచికరమైన సేవలు అందించడంలో రాజీ పడకూడదని నిర్ణయించారు. కేటరింగ్ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సభ్యులకు పరిచయం చేయడం, వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వృత్తిలోకి కొత్తగా వస్తున్న యువతకు సరైన దిశానిర్దేశం చేసి, వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలని ప్రతిపాదించారు. సభ్యుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడం, ఆపదలో ఉన్న వృత్తిదారులను ఆదుకోవడం వంటి సేవా కార్యక్రమాలపై చర్చించారు. కేటరింగ్ రంగంలో అపార అనుభవం గడించి, ఎంతోమందికి వృత్తి మెలకువలు నేర్పిన కురువృద్ధులు గంగవరపు మల్లిఖార్జున్‌ను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను సభ కొనియాడింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ సౌత్ జోన్ ఛైర్మన్ పమిడిపాటి చంద్రశేఖర్, ప్రకాశం జిల్లా సెక్రటరీ మైలాపురం సుబ్రహ్మణ్యం, పల్నాడు గౌరవ అధ్యక్షులు గంజి పోలయ్య, చిలకలూరిపేట పట్టణ అధ్యక్షులు కిరణ్ తదితరులు హాజరై తమ సూచనలు అందించారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశం ద్వారా కోనసీమ కేటరింగ్ వృత్తిదారుల మధ్య ఐక్యత మరింత బలపడిందని, నూతన అధ్యక్షుని సారథ్యంలో అసోసియేషన్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# 10 వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల తోడ్పటుతో అల్పాహారం





**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 61 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయుల సహకారం తో ప్రతిరోజు స్నాక్స్ ఏర్పాటు చేయటం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయిని తోట పుష్పావతి అన్నారు. ఉదయం 8 గంటల నుంచి అదనపు తరగతులు పాఠశాల ప్రారంభానికి ముందు ఒక గంట,సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు జరుగుతుండగా, విద్యార్థులు నీరసంగా ఉండటానికి గమనించిన ప్రధానోపాధ్యాయిని తోట పుష్పావతి విద్యార్థులకు తాను సాయంకాలం అదనపు తరగతి గదులకు మనం స్నాక్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించగా పాఠశాలలోని ఉపాధ్యాయులు అందరూ కొంత మొత్తాన్ని ఏర్పాటు చేసి జనవరి 27వ తారీకు నుంచి ప్రతిరోజు సాయంత్రం వివిధ పౌష్టికాహార పదార్థాలు, బొప్పాయి,కర్బూజా, జామకాయ, అరటికాయ,సెనగలు, గోదావరి ఉప్మా మరియు బిస్కెట్లు వంటివి ప్రతిరోజు ఏర్పాటు చేస్తున్నామని విద్యార్థులు ఈ సౌకర్యాలు ఉపయోగించుకుని బాగా చదువుకుని మంచి మార్కులు పొందాలని సూచించారు.

# ఉత్కంఠ భరితంగా గిత్తల పూటీ లాగుడు పోటీలు



**నందిగామ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి ఆలయ మహాశివరాత్రి తిరణాల మహోత్సవాల పురస్కరించుకొని మంగళవారం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో కూడలి రైతు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ సమీప ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూటీ లాగుడ పోటీలను ఆలయ కమిటీ చైర్మన్ గుంజుపల్లి శ్రీనివాసరావు,దాములూరి గ్రామ సర్పంచ్ గాదెల వెంకట రామారావు ప్రారంభించారు.మొదటి రోజు న్యూ జూనియర్ విభాగంలో గిత్తలకు నిర్వహించిన పూటీలాగుడు పోటీల్లో 9 జతలు పాల్గొన్నాయి.ఒక క్వింటా50 కేజీల బరువుతో నలుగురు వ్యక్తులతో పది నిమిషాల వ్యవధిలో సమయంలో పూటీలాగుడు పోటీలు నిర్వహించారు.పలు గ్రామాల నుండి వచ్చిన రైతులు ప్రజలు ఆసక్తికరంగా తిలకించారు. ఈ పోటీలకు రిఫరీ గా నాగిరెడ్డి వ్యవహరించగా జవ్వాజి భాస్కరరావు,వట్టి కొండ చంద్రమోహన్,చల్లా తులసీరావు,తోట నాగమల్లేశ్వరరావు,అద్దంకి కేశవరావు,చెరుకూరు గాంధీ, చెరుకూరి సాంబశివరావు, జంగాల శ్రీనివాసరావు,గాదెల వీరబాబు,మల్లెల వెంకటేశ్వర రావులు పర్యవేక్షించారు.

# స్నేహితుల కొరత..!





**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు స్నేహితుల కొరత ఏర్పడింది. 1960 ప్రాంతంలో ఒక్కక్కరికి 100 మంది స్నేహితులు ఉండేవారట. 1990 లలో ఒక్కొక్కరికి 5 గురు స్నేహితులు ఉండేవారు. ఇప్పుడు ఒక్కరు ఉండటం కూడా గగనమే. దేశంలో 12% జనాభాకు స్నేహితులు లేరని ఒక సర్వేలో తేలింది.... స్నేహితులతో ముఖాముఖి గడిపే సమయం గతంలో 1 గంట ఉంటే ప్రస్తుతం 35 నిమిషాలకి పడిపోయింది..మంచి స్నేహితులు లైఫ్ ఇన్సూరెన్స్ లాంటి వారు. స్నేహితులు లేనివారు రోజుకు 20 సిగరెట్లు తాగినంత స్ట్రెస్ అనుభవిస్తారట. మంచి స్నేహితులు ఉన్నవారిలో బ్లడ్ ప్రెషర్ , గుండె వ్యాధులు తక్కువని పరిశోధనలు తెలుపుతున్నాయి. స్నేహితులు తోడుగా ఉన్నవారు ఆహ్లాదంగా ఉంటారు. వ్యాయామం, క్రీడలు, ఇతర కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. వారి సాంగత్యంలో మన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.కానీ స్నేహితులు ఊరికినే ఏర్పడరు. స్నేహానికి సమయం పెద్ద ఇన్వెస్ట్మెంట్ . కనీస పరిచయం ఏర్పడాలంటే 40 గంటలు కలసి గడపాలి, ఒక మాదిరి స్నేహం ఏర్పడాలంటే ఇంకో 90 గంటలు, గట్టి స్నేహం ఏర్పడాలంటే ఇంకో 40 గంటలు కావాలట. మన దగ్గర ఇంత సమయం ఉందా ఇప్పుడు..? ఒక సారి మంచి స్నేహం ఏర్పడ్డాక దానిని నిలుపుకోవాలంటే రోజూ కొంత సమయం కేటాయించాలి. ఇక మనం పని చేసే ప్రాంతంలో మనం స్నేహం అనుకునేది చాలా వరకు ఉపరితల ముచ్చటే...ఇక ఫేస్ బుక్ వాట్సాప్ స్నేహాలు చొప్పదండూ ముచ్చటే.బార్ మరియు రెస్టారెంట్ స్నేహాలు మత్తు ఉన్నంత వరకే..మొత్తం మీద స్నేహానుభంధాలు తగ్గిపోతున్నాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నప్పటికీ, స్నేహితులు కలిసే సమయం లేదు మిత్రమా...? అనేదే అతి పెద్ద కారణం....

# తాగునీటి సరఫరాలో అలక్ష్యం వద్దు - మున్సిపల్ కమీషరు మనోహార్



**గుడివాడ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :**గుడివాడ మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ బుధవారం ఉదయం ధనియాలపేట న్యూ కాలనీ మరియు ఓల్డ్ కాలనీలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ పరిశీలనలో ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అక్కడ ఉన్న ప్రజలు త్రాగునీటి సమస్య గురించి చెప్పడం జరిగింది. సంబంధిత సమస్య తాగునీటి సరఫరా పరిస్థితిని పరిశీలించి, ఎక్కడైనా లీకేజీలు ఉన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. డ్రైన్ క్రాస్ వద్ద ఉన్న గృహ కనెక్షన్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నూతన రోడ్లు మరియు డ్రెయిన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ని పరిశీలించి మిగిలి ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయమని ఆదేశించడం జరిగింది.

# వీధి కుక్కల దాడి.. గాయాల పాలైన వాహనదారుడు

● వెంటనే స్పందించి బైక్ రైడర్‌ని ఆసుపత్రికి తరలించిన అర్.కె.వారియర్స్..



**గుడివాడ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని కాపాడి ఆసుపత్రిలో చేర్పించిన గుడివాడ పట్టణ ఆర్కే వారియర్స్.. ! స్థానిక బంటుమిల్లి రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి వీధి కుక్కల దాడిలో మోటర్ బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఆ వ్యక్తి కాళ్లు విరిగి తీవ్ర రక్తస్రావం అవడంతో అక్కడ ఉన్న స్థానికుల సమాచారం మేరకు వెంటనే స్పందించి అంబులెన్స్‌కి తెలియజేసి ఆ వ్యక్తిని ఆసుపత్రిలో వైద్యం నిమిత్తం తరలించడమైనది. ఈ సందర్భంగా గుడివాడ పట్టణ బిజెపి అధ్యక్షులు డా. మాచర్ల రామకృష్ణ (ఆర్.కె.) మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో వీధి కుక్కల వల్ల చాలా మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యని చాలాసార్లు మున్సిపల్ కమిషనరుకి తెలియజేశామని, ముఖ్యంగా పిల్లలు, పాఠశాలలకు వెళ్లాలన్న, ఎక్కడికైనా వెళ్లాలన్న భయంతో ఉంటున్నారని, ఈరోజు ఈ వ్యక్తి ఇలా పడిపోవడానికి కారణం కేవలం వీధి కుక్కల దాడి చేయడం వల్ల దయచేసి సృహాదయంతో వీధి కుక్కల మీద చర్యలు తీసుకోవాలని కోరారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి - సిఐ కొండపల్లి శ్రీనివాస్




**గుడివాడ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** ట్రాఫిక్ నియమ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వన్ టౌన్ సిఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. కృష్ణా జిల్లా పోలీస్ శాఖ ఆదేశాల మేరకు గుడివాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏఎన్నార్ కాలేజీ సమీపంలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా గుడివాడ వన్ టౌన్ సిఐ కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన ఫ్లెక్సీ ఏర్పాటు చేయబడింది. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం జరిగింది. వాహనదారులు వేగ పరిమితులు పాటించడం, హెల్మెట్ మరియు సీటుబెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచనలు ఇవ్వబడినవి. ప్రజలు తమ భద్రత కోసం ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, అప్రమత్తంగా వాహనాలు నడపాలని గుడివాడ వన్ టౌన్ సిఐ కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.

# ముగిసిన మహా 'శివరాత్రి' మహోత్సవం



**గుడివాడ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** స్థానిక గౌరీ శంకర్ పురంలో వేంచేసి ఉన్న శ్రీ గౌరీ శంకర్ స్వామి వారి దేవస్థానం నందు వార్షిక కళ్యాణ మహోత్సవములు, మహాశివరాత్రి మహోత్సవ కార్యక్రమంలో సోమవారం సాయంత్రం ధ్వజ అవరోహణ ద్వాదశ ప్రదక్షిణలు గ్రామోత్సవం మరియు పవళింపు సేవా కార్యక్రమంలో అత్యంత వైభవోపేతముగా జరిగింది అని దేవస్థాన కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలియజేసినారు. అలాగే ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండుటకు విధులను నిర్వహించినటువంటి పోలీస్ శాఖ వారికి మున్సిపల్ శాఖ, అగ్నిమాపక, మెడికల్ అధికారులకు మరియు సిబ్బందికి ప్రత్యేకంగా ధన్యవాదములు పేర్కొన్నారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ నేరుసు శుభోష్ చంద్ర బోస్ మరియు ధర్మకర్తలు మండలి సభ్యులు మాట్లాడుతూ శ్రీ స్వామి వారి దేవస్థానం యందు మహాశివరాత్రి పర్వదినములు అత్యంత వైభవపేతముగా నిర్వహించబడినందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియజేసినారు.

# చెక్ పోస్ట్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఏఎంసీ చైర్మన్ అనంత లక్ష్మీ



**పెడన,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం పరిధిలోని రామరాజు పాలెం చెక్ పోస్టును పెడన మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ భీముని అనంతలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద జరుగుతున్న రవాణా తనిఖీలు రికార్డుల నిర్వహణ సిబ్బంది హాజరు ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై సమగ్రంగా పరిశీలించారు. విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు సూచిస్తూ, పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. అవసరమైన చోట సౌకర్యాల మెరుగుదలకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందేలా చర్యలు కొనసాగించాలని ఆమె పేర్కొన్నారు.

# కొంటు ముకుందం జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బి.సి.నేత భేరి



**హైదరాబాద్,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేదరి మహేంద్ర సంఘం అధ్యక్షులు కొంటు ముకుందం జన్మదిన వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ పాల్గొని ముకుందం అన్నకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సంతోషంగా జీవించాలని మునుముందు మరెన్నో ఇలాంటి జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక ముఖ్య సలహాదారు పట్లూరి కృష్ణమోహన్ ముకుందం కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు , తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షులు టి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు రాజశేఖర్ యాదవ్ ను శాలువాతో సత్కరించారు. ఈ వేడుకకి ముఖ్య అతిథిగా విచ్చేసిన తమ్మ చంద్ర మౌళి ముకుందంని సత్కరించి ఆశీర్వదించారు , మేడ్చల్ వాస్తవ్యులు వెంకట్ ని శాలువాతో, పూలమాలతో సత్కరించారు ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మేదరి మహేంద్ర సంఘం దుందిగల్ మండల్ ప్రెసిడెంట్ రాజేందర్, నారాయణ గౌడ్ , తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న , ఎం వి ఎస్ నాయక్ , కీర్తి కుమార్ , చైర్మన్ ఇస్మాయిల్ , శ్రీకాంత్ రెడ్డి , బిసి ఐక్యవేదిక ఆర్గనైజింగ్ సెక్రెటరీ హరికృష్ణ చారి , సిద్దార్థ , శీను పటేల్ , మరియు కుటుంబ సభ్యులు బంధువులు మిత్రులు శ్రేయోభిలాషులు అందరూ పాల్గొని జన్మదిన వేడుకలని విజయవంతం చేశారు.

# దేశంలో బీజేపీ ప్రమాదకర రాజకీయాలను చేస్తోంది

- సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ
- లడ్డూ వివాదాన్ని వదిలి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య
- కాకినాడలో రెండో రోజు సీపీఐ సమావేశాలు

**కాకినాడ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** దేశంలో ప్రమాదకరమైన రాజకీయాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వహిస్తుందని దేశ ప్రయోజనాలు దెబ్బతినే విధంగా బహుళజాతి సంస్థలకు మోదీ ప్రభుత్వం ఊడిగం చేస్తుందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు కే రామకృష్ణ అన్నారు. పూర్తి వ్యవసాయ ఆధారితమైన దేశంలో వ్యవసాయానికి తీవ్ర నష్టం చేసే విధంగా మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అమెరికా నుండి దిగుమతి చేసుకునే వ్యవసాయ ఉత్పత్తులకు సుంకం లేకుండా గాను అనుమతిచ్చి రైతులను, రైతు ఉత్పత్తులను నాశనం చేస్తుందన్నారు. అమెరికాకు తొత్తుగా మోడీ వ్యవహరిస్తున్నారని ఆయన చెప్పారు. సీపీఐ రాష్ట్ర సమితి కార్యవర్గ సమావేశం రెండో రోజు మంగళవారం కాకినాడలోని సూర్యకళా మందిరంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఉదయం విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మన దేశ నిర్ణయాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడం దానికి మోడీ ఖండించకపోవడం పలు అనుమానాలు తావిస్తోందన్నారు. ప్రపంచాన్ని కుదిపేసిన ఎప్స్టీన్ ఫైల్స్ బహిర్గత అయిన తర్వాత మోడీపై ట్రంప్ మాటల దాడిని పెంచినా అతను స్పందించడం లేదన్నారు. కేంద్ర బడ్జెట్ 53 లక్షల నలభై వేల కోట్లతో ప్రవేశపెట్టారని అందులో 14 లక్షల కోట్లు వడ్డీ కట్టడాన్ని బట్టి చూస్తే దేశం మరింత అప్పుల ఊబిలోకి కూరుకు పోతుందని చెప్పారు. 2014లో దేశం అప్పు 55 లక్షల కోట్లు ఉండగా అది ప్రస్తుతం 214 లక్షల కోట్లకు చేరిందన్నారు. దీన్ని బట్టి చూస్తే దేశం ఏ విధంగా ముందుకు పోతుందో అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు పేదలకు అవసరమయ్యే వైద్యాన్ని ప్రైవేటుపరం చేయడం తగదన్నారు. ప్రభుత్వం తరపున అన్ని వసతుల కల్పించి మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం ఎక్కడా లేదన్నారు. త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలపై ఈనెల 25, 26 తేదీల్లో ఢిల్లీలో జాతీయ కార్యవర్గంలో జరిగే సమావేశం చర్చిస్తామన్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీని నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ 25, 26 తేదీల్లో అనంతపురం జిల్లా బండ్లపల్లిలో ఆందోళన నిర్వహిస్తామని రామకృష్ణ చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, అభివృద్ధిపై దృష్టి చూపకుండా తిరుమల లడ్డు చుట్టూ రాజకీయాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కల్తీ జరిగిందని నివేదిక వస్తే దానికి సంబంధించిన బాధ్యులపైన, అక్రమంగా కోట్లాది రూపాయలు దోపిడీ చేసిన వ్యక్తులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు 30 ఏళ్ల క్రితం 4000 కోట్లతో వెలుగోడు ప్రాజెక్టును సీఎం చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా ప్రారంభించారని అది నేటికీ పూర్తికాలేదన్నారు. ఈ విధంగా ఎన్నో సాగు నీటి ప్రాజెక్టులు అసంపూర్తిగానే ఆగి ఉన్నాయన్నారు. అలాగే ఇంకా ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు ఒరిస్సా సరిహద్దుల్లో ఆగిపోయన్నారు. రంగ అభివృద్ధికి స్వాగినేటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఆయిల్ నిక్షేపాలు ఉన్నాయని అది రాష్ట్రానికి వినియోగించుకోని యువతకు ఉపాధి కల్పనకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. తిరుమల లడ్డుపై చంద్రబాబు, జగన్, పవన్ నాటకాలు ఆపి త్వరితగతిన చర్యలను బాధ్యులపై చేపట్టాలన్నారు. ప్రతిపక్ష వైసీపీ అసెంబ్లీలోకి వెళ్లి ప్రజా సమస్యలను లేవనెత్తాలని ఈశ్వరయ్య కోరారు. రాష్ట్రంలో నాలుగు సమ్మెట్ల ద్వారా 80 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చెబుతున్న ప్రభుత్వాలు అవి ఎంతవరకు అమలు జరిగాయో బహిర్గతం చేయాలన్నారు. రాష్ట్రంలో మహిళ, యువత, కార్మిక, సమస్యలను పరిష్కారం కోసం పోరాటం చేసి సీపీఐ బలోపేతానికి కృషి చేస్తామని ఈశ్వరయ్య చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, తాటిపాక మధు, రావుల వెంకయ్య, జిల్లా కార్యదర్శి కె బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# కాకినాడను 'పీపుల్స్ పరడైజ్'గా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరం: కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ



**కాకినాడ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** కాకినాడ నగరాన్ని 'పీపుల్స్ పరడైజ్'గా అభివృద్ధి చేసేందుకు ప్రతి పౌరుడు భాగస్వామిగా మారాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని కొవ్వూరు రోడ్, అన్నమ్మఘాటి సెంటర్ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. పర్యటన సందర్భంగా రహదారిపై కట్టెల పొయ్యి పెట్టి వంట చేస్తున్న వారిని గుర్తించిన కమిషనర్ తీవ్రంగా హెచ్చరించారు. రోడ్లపై వంట చేయడం ప్రజా ఆరోగ్యానికి మరియు రవాణాకు అంతరాయం కలిగిస్తుందని పేర్కొంటూ, ఇటువంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఘాటి సెంటర్లో ఉన్న అన్న క్యాంటీన్ను సందర్శించిన ఆయన అక్కడ అల్పాహారం తీసుకుంటున్న ప్రజలను పలకరించి అల్పాహారం నాణ్యతపై ఆరా తీశారు. ఆహారం ఎలా ఉందని అడిగి తెలుసుకుని, ప్రజల నుంచి వచ్చిన సానుకూల అభిప్రాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ, గతంలో కాకినాడను 'పెన్షనర్స్ పరడైజ్'గా పిలిచేవారని, అయితే నేడు నగరాన్ని 'పీపుల్స్ పరడైజ్'గా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. అందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా, పారిశుద్ధ్య కార్మికులకు మాత్రమే అందజేయాలని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్పొరేషన్ పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించి మన కాకినాడను పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన నగరంగా మార్చుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ కనకరావు, డిఇ ఆదినారాయణ, స్థానిక నాయకురాలు అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# రిలయన్స్ స్కాలర్షిప్ కు ఎంపికైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని

- విద్యార్థిని పసుపులేటి డామిని సరయు ని అభినందించిన ప్రిన్సిపాల్ డా.ఇల్ల రవి



**మైలవరం ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** స్థానిక డా.లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థిని పసుపులేటి డామిని సరయు రిలయన్స్ ఎడ్యుకేషన్ స్కాలర్షిప్ కు ఎంపికయ్యింది. 10 అక్టోబర్ 2025 జరిగిన రిలయన్స్ స్కాలర్షిప్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్లో మెరిట్ సాధించి 50 వేల స్కాలర్షిప్ కు ఎంపిక అవడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా.ఇల్ల రవి విద్యార్థిని పసుపులేటి డామిని సరయు ని ప్రత్యేకగా అభినందించారు. మిగిలిన రెండు సంవత్సరాలు కూడా ఈ స్కాలర్షిప్ అందుతుందని,పి.జి లో కూడా ఈ స్కాలర్షిప్ వస్తుందని మొత్తం ఐదు విడతల్లో రెండు లక్షల యాభై వేలు ఆర్థిక సహాయం రిలయన్స్ సంస్థ ఈ స్కాలర్షిప్ అందిస్తుందని ఆయన తెలియ జేశారు. స్కాలర్షిప్ కి ఎంపికైన విద్యార్థిని బీకాం కామర్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు అభినందిం చారు.

# నందమూరు శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థికి డిస్కస్ త్రో లో రజత పతకం



**పెడన,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** డిస్కస్ త్రో లో జరిగిన పోటీలలో శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో బీ టెక్ విద్యార్థి ఎం డి జమీల్ పాషా కు రజిత పథకం లభించింది. విజయవాడ వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్వ విద్యాలయంలో ఈనెల 11 నుంచి 17 వరకు నిర్వహించిన విటోపియా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్-2026 పోటీలలో ఈ పతకం లభించింది. ఏపీ తెలంగాణ స్థాయి కళాశాల విభాగంలో ఈ పోటీలు జరిగాయి. విజేత పాషాను వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి రమేష్ ను కళాశాల కరస్పాండెంట్ కే కుమార్ బాబు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి బాబా ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఆర్.ఎస్ రెడ్డి వివిధ విభాగాధిపతులు వ్యాయామ ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.

# సైనికుల సేవలు వెలకట్టలేనివి

- హోం మంత్రి అనిత
- రాష్ట్ర హోం మంత్రిని సన్మానించిన మాజీ సైనిక ఉద్యోగులు




**నందిగామ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** దేశ సేవలో సైనికుల పాత్ర వెలకట్టలేనిదని హోం మంత్రి అనిత అన్నారు. మంగళవారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో నందిగామ మాజీ సైనిక ఉద్యోగులు వాసిరెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో హోం శాఖ మాత్యులు అనితను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ విటరన్స్ డే సందర్భంగా అనిత సన్మానించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ దేశ సేవలో సైనికులు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. దేశ సరిహద్దుల్లోనీ పాకిస్తాన్ యుద్ధంలో సైనికులు ప్రదర్శించిన ధైర్య సాహసాలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో నందిగామ కు చెందిన మాజీ సైనిక ఉద్యోగులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా స్వామి వారి రథోత్సవం



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక కృత్తివెన్ను గ్రామంలో గుడిదిబ్బనందు కొలువై ఉన్న శ్రీ దుర్గా పార్వతీ సమేత శ్రీ నాగేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో మూడవరోజు మంగళవారం సాయంత్రం అంగరంగ వైభవంగా మేళ తాళాలతో వేదమంత్రాలతో వేలాదిమంది భక్తుల శివ నామస్మరణతో స్వామివారి రథోత్సవ ఊరేగింపును నిర్వహించారు. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించి భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. మూడు రోజులపాటు మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా తగు ఏర్పాట్లు చేసి కార్యక్రమాలు అన్నిటిని దిగ్విజయంగా విజయవంతం చేసినట్లు సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు

# యు టీ ఎఫ్ రణభేరి



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** యు టీ ఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు విజయవాడ మంగళవారం ధర్నా చౌక్ నందు నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న కృతివెన్ను మండలం తరపునపాల్గొన్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొప్పినీడి సూర్య ప్రకాష్ జిల్లా కార్యవర్గ సభ్యులు బొర్రా వీరాస్వామి ఆదినారాయణ,మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు సానారామకృష్ణ ఉండి పురుషోత్తం గౌరవ అధ్యక్షుడు వీరంకి శ్రీనివాసరావు సానా ఏడుకొండలు పొన్నాల నాగరాజు చంద్రమోహన్ పట్టాభి జోసెఫ్ మొదలగువారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ మాట్లాడుతూ పి ఆర్సీ వెంటనే నియమించాలని ఐ ఆర్ విడుదల చేయాలని పెండింగ్ లో ఉన్న ఐదు డి ఏ లు వెంటనే చెల్లించాలని,సరెండర్ లీవు బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రణభేరి కార్యక్రమం లో రాష్ట్ర నలుమూలల నుండి సుమారు పదివేల మంది యు టీ ఎఫ్ కార్యకర్తలు హాజరై విజయవంతం చేశారు. ఇప్పటికైనా పెండింగ్ బకాయిలు చెల్లించి,వెంటనే పి ఆర్ సి కమిషన్ నియమించి ఐ ఆర్ విడుదల చేయాలని రాష్ట్ర నాయకులు కోరారు.

# జగ్గంపేట అభివృద్ధిపై అసత్య ప్రచారాలు మానుకోవాలి: కిర్లంపూడి మండలం తెలుగు తమ్ముళ్లు



**కిర్లంపూడి,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొందరు కావాలని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షులు వీరరెడ్డి కాశీబాబు మండిపడ్డారు. స్వతంత్ర అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర చేసిన ఆరోపణలు అర్థరహితమని, కేవలం రాజకీయ ఉనికి కోసమే ఆయన ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూర్యచంద్ర విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చారు.

**అభివృద్ధిపై వాస్తవాలు ఇవీ..**

**ఏలేరు ఆధునికీకరణ:** గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిన ఏలేరు ఆధునికీకరణ పనులను కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో చేపడుతోంది. దీనిపై ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

**అవినీతి ఆరోపణలు:** మట్టి,ఇసుక అక్రమ రవాణా అంటూ రూ. 200 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం సూర్యచంద్ర అజ్ఞానానికి నిదర్శనం. ఆధారాలు ఉంటే చూపాలి తప్ప, గాలి మాటలు మాట్లాడటం సరికాదు.

**విద్య, మౌలిక వసతులు:** డిగ్రీ కళాశాల, బ్రిడ్జిల నిర్మాణంపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఇప్పటికే ప్రభుత్వంతో చర్చలు జరిపారు. త్వరలోనే వీటికి సంబంధించిన నిధులు మంజూరు కానున్నాయి.

**రాజకీయ పబ్బం కోసమే విమర్శలు..** జ్యోతుల నెహ్రూ కేవలం తన కుమారుడి విజయం కోసం చూస్తున్నారనడం హాస్యాస్పదం. నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వారు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాం. ప్రజా సమస్యల పరిష్కారంలో నెహ్రూ ఎప్పుడూ ముందుంటారని కాశీబాబు స్పష్టం చేశారు. అభివృద్ధి నిరోధక శక్తులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, జగ్గంపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని, ఇలాంటి తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు.

# దివంగత వాసి రెడ్డి శంకర భవాని కి ఘన నివాళి



**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండల తెలుగు దేశం పార్టీ నాయకులు, అయ్యప్పస్వామి సేవా సమితి అధ్యక్షులు, శ్రీ తిరుపతమ్మ ఆలయ మాజీ చైర్మన్ వాసిరెడ్డి బేనార్జీ సతీమణి దివంగత వాసిరెడ్డి శంకర భవాని కి మంగళవారం వారి నివాసానికి వచ్చి టీ డి పి నేత మల్లెల గాంధీ , మక్కపేట అయ్యప్ప స్వాముల గురు స్వామి శ్రీను , వాసిరెడ్డి శంకర భవాని కి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈలాంటి సమయంలో ధైర్యం గా వుండాలని వాసిరెడ్డి బేనార్జీ కి వారి కుమారుడు వాసిరెడ్డి బాలు కు సూచించారు.

# జాతీయ నులుపురుగుల నిర్మూలనకార్యక్రమం



**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సూచనలతో బాపులపాడు గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ నందు జాతీయనులుపురుగులనిర్మూలనకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, చలమలశెట్టి రమేష్, అట్లూరి శ్రీనివాసరావు, మూల్పూరి సాయి కళ్యాణి, మొవ్వ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్రై సైకిల్ పంపిణీ



**నందిగామ,ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ వారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైతు పేటలో గల రామకృష్ణ ప్లాజా నందు ఒక వికలాంగునకు ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా ట్రై సైకిల్ అందుకున్న వికలాంగుడు క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మాలింపాటి ప్రసాదు, లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు తొర్లికొండ సీతారామయ్య. కొట్టి హరికృష్ణ,బద్రి,గాంధీ. చెన్నారావు పాల్గొన్నారు.

# కోడూరు స్వర్ణ పంచాయితీలో కాంట్రాక్టు సిబ్బంది ఆకలి కేకలు

- జీతాలకోసం ఎదురు చూపు....!
- ఐదు నెలలుగా జీతాలు అందక మదన పడుతున్న పారిశుద్ధ్య కార్మికులు
- అప్పులు చేసి కుటుంబాలను పోషించు కుంటున్న పారిశుద్ధ్య కార్మికులు
- పట్టించుకోని పంచాయితీ పాలకులు, అధికారులు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి మొరపెట్టు కుంటున్న కాంట్రాక్టు సిబ్బంది

**స్వర్ణ పంచాయతీలుగా చెప్పుకుంటున్న గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది ఆకలి కేకలు పెడుతున్నారు. వీరికి నెలలు తరబడి వేతనాలు అందక కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకుంది. జీతాలు అందక మదన పడుతున్నారు. జీతాల కోసం రోజులు తరబడి ఎదురు చూస్తున్నారు. ఇంటిలో పూటగడవటమే కష్టంగా మారడంతో వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి. వీరు జీతాల కోసంఎదురు చూడని రోజులేదని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.**




**జి.కొండూరు(కోడూరు),ఫిబ్రవరి 17 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండల పరిధిలోని కోడూరు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి 5 నెలలుగా జీతాలు అందక అవస్థలు పడుతు న్నారు. స్వర్ణాంధ్ర,స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇంటింటికి తిరిగి తడి చెత్త పొడి చెత్తను సేకరించడంతో పాటు గ్రామాలలో కంపు కొడుతున్న డ్రైనేజీలను శుభ్రపరచడం వంటి పనులు చేస్తుంటారు. ఈ పనులు అందరూ చేయలేరు. వీరు చేస్తున్న పనులకు తగిన వేతనాలు లేవు. అయినా చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీస్తున్నారు. మరోవైపు రాష్ట్రప్రభుత్వం పంచాయితీకి వచ్చే నిధుల్లో నుంచి ముందుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ కొన్ని గ్రామ పంచాయతీల లో పాలకులు,అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణం గా కాంట్రాక్ట్ కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వడంలేదు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు ఎక్కువ వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి నెలకొంది. వేతనాలు అందక తమ పిల్లలకు మూడు పూటలా సరైన ఆహారం కూడా అందించలేని పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధి కారులు స్పందించి తక్షణమే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకొని మా కుటుంబాలను ఆదుకోవాలని కోడూరు గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు.




Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188